teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 282 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 21 ఫిబ్రవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## హైడ్రాపై హైకోర్ట్ అసహనం

న్యాయస్థానం
ఆదేశాలంటే లెక్కలేదా..?
సెలవు దినాల్లో కూల్చివేతలు
చట్టవిరుద్ధం
చెప్పినా నిబంధనలు పాటించరా
ఇష్టానుసారం కూల్చివేతలు
చేపడతారా అంటూ ఫైర్
హైడ్రా ఇన్స్పెక్టర్ రాజశేఖర్ పైన
మండిపడ్డ ధర్మాసనం



03

# రాజలింగం కేయిస్ హత్యా...

# కక్షపూరిత హత్యా...?






## రాజకీయ వివాదంగా రాజలింగమూర్తి మృతి

అధికార, విపక్షాల మధ్య మాటల వార్
మేడిగడ్డపై కేసే కారణం అంటూ ఆరోపిస్తున్న భార్య సరళ
రాష్ట్ర సర్కార్ సీరియస్.. స్పందించిన సీఎం
ఇప్పటికే కొంత మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
అన్ని కోణాల్లో బృందాలుగా పోలీసుల విచారణ
భయాందోళనలో స్థానికులు
పూర్తి విచారణ అనంతరం
వెలుగులోకి రానున్న కారణాలు



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలో కొన్ని పిల్లర్లు కుంగిపోవడానికి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని ఫిర్యాదు చేసిన భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తిని బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో పొడిచి హత్య చేసిన విషయం తెలిసిందే. కాగా భూపాలపల్లి జిల్లాలో జరిగిన రాజలింగం హత్య కేసు రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ వివాదానికి దారి తీస్తున్నది.

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై కేసు వేసినందుకు బీఆర్ఎస్ నేతలే హత్య చేయించారని అధికార పార్టీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఈ హత్య కుట్రపూరితంగానే జరిగిందన్నారు. ఘటనపై సీఎం సీరియస్‌గా ఉన్నారని.. దోషుల్ని వదిలే ప్రసక్తే లేదని చెప్పారు. మరో వైపు రాజలింగ మూర్తి హత్యను

మిగతా 2 లో



## ఒక్కో నిరుద్యోగికి రూ. 56 వేల "ప్రభుత్వం" బకాయి

హామీల పేరుతో ప్రజలను
మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ
ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వాఖ్యలు

.. వివరాలు 2లో

### మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి


# నేడే శ్రీకారం

## ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్

## రూ.5 లక్షల పూర్తి సబ్సిడితో "ప్రభుత్వం" ఆర్థిక సహాయం

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రజలకు సర్కార్ భారీ శుభవార్త తెలిపింది. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో కీలకమైనది ఇందిరమ్మ ఇండ్లు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుపై సర్కార్ అన్నీ దఫాల వడపోతాల అనంతరం అర్హులను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో నేడు సీఎం రేవంత్ రెడ్డి

మిగతా 2 లో








## సమాచార కమిషన్లో 10 మంది కమిషనర్లను నియమించాలి

సెక్షన్ 15 ప్రకారం నియమించి చట్టబద్ధతను కాపాడాలి
పెరుగుతూనే ఉన్న పెండింగ్ దరఖాస్తుల సంఖ్య
చట్టబద్ధతను కోల్పోతున్న సమాచార హక్కు చట్టం
ప్రభుత్వం మేల్కొవాలి.. పౌర హక్కు అమలుకు పాటుపడాలి
ఆర్టిఐ సంరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి శేఖర్ డిమాండ్



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ లో ఒక్క కమిషనర్ కూడా లేక సుమారు సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో పెండింగ్ దరఖాస్తుల సంఖ్య అంతకంతకు పెరుగుతున్నవి. ఈ సంఖ్య కమిషనర్ లను నియమించేసరికి మరింత పెరిగే అవకాశం

మిగతా 2 లో



## ఈనెల 23న తెలంగాణ ప్రదేశ్ కార్యవర్గ సమావేశం

భేటికి టీపీసీసీ చీఫ్ అధ్యక్షుడు
మహేష్ కుమార్ గౌడ్
పార్టీ సంస్థాగత అంశాలపై
చర్చించనున్నట్లు సమాచారం

.. వివరాలు 2లో



## కాళేశ్వరం కమిషన్ గడువు మరోసారి పొడిగింపు

ఏప్రిల్ 30 వరకు పెంచుతూ
ఉత్తర్వులు జారీ
ఈ దఫా పూర్తికానున్న
విచారణ, క్రాస్ ఎగ్జామినేషన్

## విద్యావ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ చేయలేం

విద్య "అంశం" కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యం కాదు
ఉమ్మడి జాబితాలోని అంశం : డిప్యూటీ సీఎం భట్టి
జాతీయ సదస్సులో భట్టి పవర్ పాయింట్ ప్రజెంటేషన్



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): విద్యా అంశం కేంద్ర ప్రభుత్వ గుత్తాధిపత్యం కాదు. ఇది ఉమ్మడి జాబితాలోని అంశమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఉన్నత విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నందున కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలన్నారు. విద్యావ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ చేయలేమని, రాష్ట్రాల్లోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా ఆయా రాష్ట్రాల

మిగతా 2 లో

## ఎస్సీ వర్గీకరణలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర ఏమీ లేదు

సుప్రీం కోర్టు తీర్పు వల్ల
వర్గీకరణకు బాటలు
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై
ఎమ్మెల్సీ కవిత విమర్శలు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): ఎస్సీ వర్గీకరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్ర ఏమీ లేదని విమర్శించారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. కల్వకుంట్ల కవిత నివాసంలో గురువారం దళిత బంధు సాధన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్సీ వర్గీకరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత్ర

మిగతా 2 లో





02

## హైడ్రా విధుల్లో డీఆర్ఎఫ్ బృందాల పాత్ర కీలకం

కొత్తగా 357 మందికి శిక్షణ ప్రారంభం
వారం రోజుల పాటు కొనసాగనున్న శిక్షణ
ప్రారంభోత్సవంలో హైడ్రా కమిషనర్
ఏవీ రంగనాథ్ వెల్లడి

## ఎంట్రాప్రెన్యూర్‌లకు రూ.5 లక్షల పరిమితితో క్రెడిట్ కార్డులు

ఏప్రిల్ నుంచి జారీ చేయనున్న కేంద్రం
ఒక సంవత్సరం పాటు చెల్లుబాటుకానున్న కార్డు




న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): కేంద్ర ప్రభుత్వం నుంచి క్రెడిట్ కార్డులను సూక్ష్మ పరిశ్రమ వ్యవస్థాపకులు త్వరలో అందుకోనున్నారు. 2025 కేంద్ర బడ్జెట్‌లో హామీ

మిగతా 5 లో

## అంగన్వాడీ సరుకుల నాణ్యతపై తనిఖీలకు ఆదేశాలు

నాణ్యతపై రాజీ పడొద్దని మంత్రి సీతక్క స్పష్టం
సరఫరాపై సప్లైయర్ కు సీతక్క హెచ్చరిక



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులకు మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీలకు సరఫరా

మిగతా 2 లో



02

## జీవవైవిధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి

పర్యావరణ ప్రేమికులకు మంత్రి
కొండా సురేఖ కీలక పిలుపు

# రాజ "లింగం" కీయ హత్యా.. కక్షపూరిత హత్యా..?

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి, ఆయన అనుచరులే చేశారని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను కొట్టి పారేశారు గండ్ర వెంకటరమణా రెడ్డి. రాజలింగమూర్తి హత్యతో తనకు సంబంధం లేదని ఆయన అన్నారు.







## రాజలింగం భార్య సంచలన ఆరోపణలు

తన భర్త రాజలింగం హత్యపై భార్య సరళ సంచలన ఆరోపణ చేశారు. రేపో మాపో మేడిగడ్డ కేసు గెలుస్తామని తెలిసి హత్య చేసారన్నారు. ఈ హత్య వెనుక మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, అతని అనుచరుడు హరిబాబు హస్తం ఉందన్నారు. తన భర్తకు గండ్ర రూ.10 లక్షలు ఆఫర్ చేశారని డబ్బులకు లొంగకపోవటంతోనే హత్య చేశారని తీవ్ర ఆరోపణలు చేశారు. హంతకులను పట్టుకొని న్యాయం చేయాలన్నారు.

## ఘటనపై స్థానికుల భిన్న అభిప్రాయాలు

స్థానికులు ఈ ఘటనపై భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు స్థానికులు రాజలింగం హత్యను రాజకీయ కుట్రగా అనుమానిస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీపై ఆయన కేసు వేయడం వల్లే హత్య చేశారని వారు అంటున్నారు. మరికొందరు మాత్రం వ్యక్తిగత కారణాల వల్లనే ఈ హత్య జరిగిందని భావిస్తున్నారు. రాజలింగంకు ఎవరితోనైనా శత్రుత్వం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తే నిజం బయటకు వస్తుందని వారు చెబుతున్నారు. రాజలింగం హత్యతో తమ గ్రామంలో భయం వాతావరణం నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ఇలాంటి ఘటనలు గతంలో ఎప్పుడూ జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు త్వరగా దోషులను పట్టుకుని, తమకు భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు. స్థానికుల అభిప్రాయాలు భిన్నంగా ఉన్నప్పటికీ, రాజలింగం హత్య మాత్రం తీవ్ర విషాదకరమైన ఘటన అని మాత్రం అందరూ అంగీకరిస్తున్నారు. ఈ కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేస్తే, త్వరలోనే నిజం వెలుగులోకి వస్తుందని ఆశిస్తున్నారు.

## ముమ్మరంగా పోలీసుల దర్యాప్తు

భూపాలపల్లి జిల్లాలో రాజలింగం హత్య కేసు చెధింపులో పోలీసుల దర్యాప్తులో ముమ్మరంగా సాగుతున్నది. అయితే, కొన్ని ముఖ్యమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సీసీ కెమెరాల సమాచారం: రాజలింగం హత్య జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నట్లు సమాచారం. పోలీసులు వాటిని పరిశీలిస్తున్నారు. అయితే, ఆ కెమెరాల్లో రికార్డ్ అయిన దృశ్యాలు ఎంతవరకు స్పష్టంగా ఉన్నాయి, అసలు రికార్డు అయ్యాయా అనే విషయం తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యుల ఆరోపణలు: రాజలింగం భార్య సరళ, తన భర్త మేడిగడ్డ బ్యారేజీపై కేసు వేసినందుకే హత్య చేశారని ఆరోపించారు. ఈ కేసు గెలుస్తామనే నమ్మకంతోనే ఆయన హత్య చేశారని ఆమె అన్నారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. పోలీసుల దర్యాప్తు: పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఇప్పటివరకు సుమారుగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

హత్యకు వాడిన కత్తి

# ఒక్కో నిరుద్యోగికి 56 వేల రూ. "ప్రభుత్వం" బకాయి

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): యాదాద్రి జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా భువనగిరిలో మీట్ గ్రీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ మూడు ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీ గెలుచుకుందన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు అడిగే ధైర్యం లేకనే తమ అభ్యర్థులను బరిలోకి దింపలేదన్నారు కిషన్ రెడ్డి. జాబ్ క్యాలెండర్ ను అధికార కాంగ్రెస్ గాలికి వదిలేసిందని, ప్రజలను, నిరుద్యోగులను, ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో ఒక్కొక్క నిరుద్యోగికి 56 వేల రూపాయలు ప్రభుత్వం బకాయి పడిందని, రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ప్రజలకు ప్రయోజనం లేకుండా పోయిందని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో రౌడీయిజానికి, స్థానం లేదు. వాటిని కఠినంగా పని చేయాలన్నారు. రామలింగ మూర్తి హత్యపై సమగ్ర విచారణ జరగాలని, రాజకీయాలకు తావు లేకుండా జరిగిన రామలింగమూర్తి హత్యపై సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఈనెల 23న తెలంగాణ ప్రదేశ్ కార్యవర్గ సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఈనెల 23న తెలంగాణ ప్రదేశ్ కమిటీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరగనుంది. ఈ భేటికి టీపీసీసీ చీఫ్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షత వహించనున్నారు. సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్‌గా నూతనంగా నియమితులైన మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శులు, ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. అదేవిధంగా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, పీఏసీ, పీఈసీ సభ్యులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అనుబంధ సంఘాల చైర్మన్లు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు, అధికార ప్రతినిధులు భేటీలో పాల్గొంటారు. రాష్ట్ర, జాతీయ రాజకీయాలు, పార్టీ సంస్థాగత అంశాలపై ప్రధానంగా చర్చించనున్నట్లుగా కాంగ్రెస్ శ్రేణులు తెలిపాయి.

# కాళేశ్వరం కమిషన్ గడువు మరోసారి పొడిగింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరం కమిషన్ గడువు పొడగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన కాళేశ్వరం ఎత్తిపోతల పతకంలో జరిగిన అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ను మరోసారి పొడగించింది సర్కార్. జస్టిస్ పీసీ ఘోష్ ఈనెల 23న తెలంగాణకు రానున్న నేపథ్యంలో కమిషన్ గడువు ఏప్రిల్ 30 వరకు పెంచుతూ తెలంగాణ నీటి పారుదల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దఫా మిగిలిన విచారణ, క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి చేయనున్నట్టు సమాచారం. కాగా తదుపరి జరగనున్న విచారణలో సీనియర్ ఇంజనీర్లు, అధికారులు, కాంట్రాక్టర్లతో సహ గత ప్రభుత్వంలోని కొంతమంది బడా నాయకులను కూడా పిలవనున్నట్టు తెలుస్తోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించగా అందులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజి కుంగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ జరపడానికి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ ను ఏర్పాటు చేసింది.

# ఎస్సీ వర్గీకరణలో సీఎం రేవంత్ రెడ్డి పాత్ర ఏమీ లేదు

మొదటి పేజీ తరువాయి

ఏమీ లేదు. వర్గీకరణ విషయంలో ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదు. సుప్రీం కోర్టు తీర్పు వల్ల వర్గీకరణకు బాటలు పడ్డాయి. షమీమ్ అక్తర్ కమిషన్ నివేదికను బయటపెట్టి వెంటనే వర్గీకరణ చేయాలి. దళితుల మధ్య పంచాయతీ పెట్టవద్దు. ఎవరికీ అన్యాయం జరగకుండా వర్గీకరణ ఉండాలి. ఎస్సీ వర్గీకరణ పేరు చెప్పి సీఎం రేవంత్ రెడ్డి మరో మోసం చేశారు. వర్గీకరణకు, ఉద్యోగాల కల్పనకు ముఖ్యమంత్రి లింక్ పెడుతున్నారు. వర్గీకరణ వంకతో జాబు క్యాలెండర్ అమలును నిలిపివేయవద్దు. కోర్టు తీర్పు వచ్చి 6 నెలలు గడిచినా ఆలూలేదు చూలు లేదన్నట్లుగా ఉంది. రేవంత్ రెడ్డి మాటలు చెబితే నమ్మరని ఢిల్లీ నుంచి ప్రియాంగా గాంధీని తీసుకొచ్చి హామీ ఇప్పించారు. దళిత కుటుంబాలకు రూ. 10 లక్షలకు బదులు 12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. ముఖ్యమంత్రికి ప్రభుత్వాన్ని నడపడం చేతకావడం లేదు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిన సీఎం రేవంత్ రెడ్డి..రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుదేలు చేశారు. ఇప్పటికే కేసీఆర్ మంజూరు చేసిన దళిత బంధు నిధులను విడుదల చేయాలి. ధైర్యం ఉంటే 18 వేల దళిత కుటుంబాలకు దళిత బంధు డబ్బులను డిమాండ్ చేయాలి. బడ్జెట్ ప్రవేశపెట్టే ముందే ఈ డబ్బులు విడుదల చేయాలి. ఎస్సీలకు బడ్జెట్ లో 33 వేల కోట్లు కేటాయించి కేవలం 9800 కోట్లే ఖర్చు చేశారు. ముందుచూపుతో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కు కేసీఆర్ చట్టబద్ధత కల్పించాలి. రేవంత్ రెడ్డిది మనసున్న ప్రభుత్వం కాదు మానవత్వం లేదు. రేవంత్ రెడ్డి ఆలోచన చిన్నది చూపు పెద్దవాళ్లపైనే ఉంది. అందుకే 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి పూలదండ కూడా వేయలేదు. అంబేద్కర్ ఆయన వారసులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవమానిస్తున్నారు. అంబేద్కర్ జయంతిలోపు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహానికి కేబినెట్ మొత్తం వెళ్లి పూలదండలు వేయాలి. లేదంటే ప్రభుత్వం మూసివేసిన గేట్లను బద్దలుకొట్టి మేమే అంబేద్కర్ ను గౌరవించుకుంటాం. అంబేద్కర్ ని గౌరవించని ముఖ్యమంత్రి మన ఆకలిని అర్థం చేసుకుంటారా ?, అట్టడుగు వర్గాల వారిని వేలు పట్టుకొని ముందుకు నడిపించాలన్నది కేసీఆర్ ఆలోచన. పేదలు, అణగారిన వర్గాల కోసం పనిచేయాలని కేసీఆర్ ఎప్పుడూ అంటున్నారు. దళితులను ధనవంతులను చేయాలన్న ఉద్దేశంతో దళిత బంధును ప్రవేశపెట్టారు. ఎన్నికల కోసం రానున్న తరాల కోసం కేసీఆర్ ఆలోచిస్తారు. అన్ని వర్గాలకు ఆత్మబంధువు అంబేద్కర్. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే ప్రత్యేక తెలంగాణ సాధ్యమైంది రెండు మూడేళ్ల తర్వాత బీఆర్ఎస్ పార్టీ అధికారంలో వస్తుంది అని కవిత స్పష్టం చేశారు.

# అంగన్వాడీ సరుకుల నాణ్యతపై తనిఖీలకు ఆదేశాలు



మొదటి పేజీ తరువాయి

అవుతున్న సరుకుల నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీలకు అందే సరుకుల నాణ్యతపై రాజీ పడోద్దని స్పష్టం చేశారు. సరైన సరుకులు సరఫరా చేయకపోతే సప్లైయర్ ను బ్లాక్ లిస్టు చేస్తామని హెచ్చరించారు. మంత్రి సీతక్క ఆదేశాలతో అప్రమత్తమైన అధికారులు క్షేత్ర స్థాయిలో విస్తృత తనిఖీలు చేపట్టాలని జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇటీవల అంగన్వాడీ కేంద్రాలకు అందుతున్న సరుకుల్లో నాణ్యత కొరవడిందన్న ఆరోపణల నేపథ్యంలో మంత్రి సీతక్క ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందించే పోషకాహారంలో నాణ్యత లేకపోతే సహించేది లేదంటూ హెచ్చరించారు. సరుకుల నాణ్యతకు సంబంధించి అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. నిబంధనల మేరకు సరుకుల నాణ్యత, పరిమాణం ఉన్నాయో లేదో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

# మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి నేడే శ్రీకారం

మొదటి పేజీ తరువాయి



భారీగా ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేయనున్నారు. శుక్రవారం సీఎం నారాయణపేట జిల్లా పర్యటన సందర్భంగా నారాయణపేట మండలంలోని అప్పకపల్లెలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేసి రాష్ట్రంలో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 72,045 ఇందిరమ్మ ఇండ్లు విడుదల కాగా వాటన్నిటికీ ఈరోజు శంకుస్థాపన పనులు మొదలు కానున్నాయి. ఇల్లు లేని కుటుంబాలందరికీ ఇండ్లు మంజూరు చేయాలని ప్రభుత్వ సంకల్పంలో భాగంగా లబ్దిదారులు స్వంతంగా ఇల్లు కట్టుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల పూర్తి సబ్సిడితో ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయనుంది. ఇంటి నిర్మాణంలో భాగంగా బేస్మెంట్ కట్టగానే రూ.1,00,000 లబ్దిదారుని ఖాతాకి నేరుగా విడుదలయ్యేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి.

# సమాచార కమిషన్లో 10 మంది కమిష్నర్లను నియమించాలి

మొదటి పేజీ తరువాయి




లేకపోలేదు. కావున ఇప్పటికే ఉన్న కమిషనర్ ల స్థానాలా సంఖ్యను (ఏడుగురు కమిషనర్ లు) 10 స్థానాలకి పెంచాలి. ఇలా పెంచితేనే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాలు త్వరితిగతిన పరిష్కరించబడుతాయని సమాచార హక్కు చట్టం సంరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి శేఖర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ లో కమిషనర్ల కొరత కారణంగా సమాచార హక్కు చట్టం అమలు ప్రశ్నార్థకంగా మారింది. కమిషనర్ల లేకపోవడం వల్ల వేలాది దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయి. దీనికి తోడు, ఉన్న కొద్దిమంది కమిషనర్లు కూడా పదవీకాలం ముగియడంతో కొత్త వారి నియామకం చేపట్టకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో, కమిషనర్ల సంఖ్యను 10 మందికి పెంచాలని డిమాండ్ చేస్తూ సమాచార హక్కు చట్టం సంరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రెడ్డి శేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ఇది ఒక్కటే మార్గమని ఆయన అన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం ఎంత త్వరగా పరిష్కరిస్తుందో వేచి చూడాలి అని రెడ్డి శేఖర్ అన్నారు.

## తెలంగాణలో సమాచార హక్కు చట్టం నీడలో గడువు లోపు రాని సమాచారం హక్కు ఉల్లంఘనే



సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సమయానికి (గడువు లోపు) సమాచారం అందకపోవడం హక్కు ఉల్లంఘన కిందకే వస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో దాదాపు రెండు సంవత్సరాలుగా కమిషనర్లు లేకపోవడంతో హియరింగ్లు, పరిశీలనలు జరగక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీని వలన పౌరులకు చట్టబద్ధంగా సంక్రమించిన సమాచార హక్కు వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశం పౌరులకు ప్రభుత్వ కార్యకలాపాల గురించి తెలుసుకోవడానికి అవకాశం కల్పించడం. ప్రభుత్వ సంస్థలు పారదర్శకంగా ఉండాలని, జవాబుదారీతనం కలిగి ఉండాలని ఈ చట్టం చెబుతుంది. కానీ కమిషనర్లు లేకపోవడం వల్ల ఈ లక్ష్యం నెరవేరడం లేదు. కమిషనర్లు లేకపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలు సమాచారం కోసం దరఖాస్తు చేసినా నెలల తరబడి సమాధానం రావడం లేదు. దీనివల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ప్రజలకు అవకాశం లేకుండా పోతోంది. అంతే కాకుండా, సమాచారం అందకపోవడం వల్ల అవినీతికి కూడా ఆస్కారం ఏర్పడుతోంది.

ఈ పరిస్థితిని మార్చడానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. కమిషనర్లను నియమించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలి. సమాచార హక్కు చట్టం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలి. తద్వారా పౌరులు తమ హక్కులను సక్రమంగా వినియోగించుకోగలుగుతారు.

# హైడ్రాపై హైకోర్ట్ అసహనం

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ లో విపత్తుల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) పై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేసింది. ఇష్టానుసారం కూల్చివేతలు చేపడతారా? అంటూ మండిపడింది. ఈ క్రమంలో తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. హైడ్రా కూల్చివేతల వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ సందర్భంగా జస్టిస్ కే.లక్ష్మణ్ తీవ్రంగా స్పందించారు. "మీ ఇష్టం వచ్చినట్లు కూల్చివేతలు చేపడతారా.. సెలవు దినాల్లో కూల్చివేతలు చట్టవిరుద్ధమని చెప్పినా నిబంధనలు పాటించరా.. న్యాయస్థానం ఆదేశాలంటే లెక్కలేకుండా వ్యవహరిస్తే.. అది తెలిసేలా చేస్తాం అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. గత విచారణ సందర్భంగా ఇచ్చిన ఆదేశాలతో హై కోర్టుకు హాజరైన హైడ్రా ఇన్స్‌పెక్టర్ రాజశేఖర్ పైనా ధర్మాసనం మండిపడింది. పోలీస్ శాఖను నుంచి డిప్యూటేషన్‌పై వచ్చినంత మాత్రాన అక్కడ వ్యవహరించినట్లు ఇక్కడ ఉంటామంటే కుదరదు అని మందలించారు. మరోసారి ఇలాగే జరిగితే మీపై చర్యలకు డీజీపీకి ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆక్రమణల స్వాధీనానికి, అక్రమ భవనాల కూల్చివేతకు మేం వ్యతిరేకం కాదన్న జస్టిస్ కే లక్ష్మణ్ ఏది చేసిన చట్టపరంగా ఉండాలని సూచించారు. అలాగని ఇష్టం వచ్చినట్లు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం విచారణను వాయిదా వేశారు.

# విద్యావ్యవస్థను ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ చేయలేం



మొదటి పేజీ తరువాయి

అవసరాలకు అనుగుణంగా విధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. గురువారం కేరళ రాజధాని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన ఉన్నత విద్య జాతీయ సదస్సులో భట్టి పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ కొత్త మార్గదర్శకాలు మీరు కచ్చితంగా బిల్లు చెల్లించాలి. కానీ మీ ఫుడ్‌ను ఆర్డర్ చేయలేరు అన్న చందంగా ఉందని ఎద్దేవా చేశారు. సరైన మార్గాన్ని ఎంచుకునే అవకాశం రాష్ట్రాలకు ఉందని చెప్పారు. సరైన నిర్ణయం తీసుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటామని హెచ్చరించారు.

## అలాగైతే ప్రారంభోత్సవాలకే పరిమితం

యూజీసీ కొత్త మార్గదర్శకాలు అమలు జరిగితే రాష్ట్రాలు కేవలం భవనాల ప్రారంభోత్సవంలో రిబ్బన్ కటింగ్ వేడుకలకే పరిమితమవుతాయని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో విద్యాశాఖకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్లు చెప్పారు. విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులను భర్తీ చేశామని, విద్యారంగంలో డిజిటల్ తెలంగాణకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్లు చెప్పారు. యూనివర్సిటీలకు వీసీల నియామకం సెర్చ్ కమిటీల్లో రాష్ట్ర ప్రభుత్వ పాత్రను తొలగించడం, వీసీల అర్హత ప్రమాణాలను మార్చడం ఆందోళనకర అంశమన్నారు. యూజీ కోర్సుల్లో ప్రవేశ పరీక్ష తప్పనిసరి చేయడంతో వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతారని చెప్పారు.

# హైడ్రా విధుల్లో డీఆర్ఎఫ్ బృందాల పాత్ర కీలకం



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): హైడ్రా నిర్వహిస్తున్న విధులన్నిటిలో డీఆర్ఎఫ్ బృందాల పాత్ర చాలా కీలకమైనదని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, ప్రజల అంచనాల మేరకు హైడ్రా పని చేయాల్సినవసరం ఉందని, ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం డీఆర్ఎఫ్‌లోకి ఔట్‌సోర్సింగ్ విధానంలో కొత్తగా తీసుకున్న 357 మంది శిక్షణ ప్రారంభోత్సవంలో కమిషనర్ మాట్లాడారు. అంబర్‌పేట్ పోలీసు శిక్షణ కేంద్రంలో వారం రోజుల పాటు ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ సమాజంలోనూ ప్రభుత్వ పరంగా హైడ్రా ప్రధానమైన భూమిక పోషిస్తున్న విషయాన్ని గుర్తు పెట్టుకుని ప్రతి ఒక్కరూ పని చేయాల్సినవసరం ఉందన్నారు. ప్రకృతివైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజల ప్రాణాలతో పాటు ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో డీఆర్ఎఫ్ పాత్ర చాలా కీలకమైనదని ఇప్పుడు హైడ్రా విధులు కూడా తోడయ్యాయన్నారు. మనమీద ఉన్న నమ్మకంతోనే ప్రభుత్వం పలు బాధ్యతలు అప్పగిస్తున్నదని, తాజాగా ఇసుక అక్రమ రవాణాను నియంత్రించే పనిని కూడా మనకు చెప్పిందన్నారు. వీటన్నిటినీ మనం ఎంతో శ్రద్ధగా, బాధ్యతతో చేయాలన్నారు. పోలీసు పరీక్ష రాసి కొద్ది మార్కుల తేడాతో ఉద్యోగం పొందలేని వారి మెరిట్ లిస్టు ఆధారంగా సామాజిక అంశాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని మిమ్ములను ఎంపిక చేశాం ఇది ఎంతో పారదర్శకంగా జరిగిందన్నారు. ప్రస్తుత తరుణంలో ఉద్యోగాలకు ఎంతో పోటీ ఉందని మీకు దొరికిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ప్రతిభ కనబర్చాలన్నారు. భారీ వర్షాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు ఇలా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు అండగా ఉంటూ ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించే విధానాలపై వీరంతా అంబర్‌పేట పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్నారని వెల్లడించారు.

# జీవవైవిధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి



రంగారెడ్డి, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): పర్యావరణ ప్రేమికులకు మంత్రి కొండా సురేఖ కీలక పిలుపునిచ్చారు. దెబ్బతింటోన్న జీవవైవిధ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. గురువారం రంగారెడ్డి జిల్లాలో తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డు ఏర్పాటు చేసిన నేషనల్ బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్‌లో మంత్రి పాల్గొని మాట్లాడారు. మన పర్యావరణం, నీరు, భూ పరిరక్షణ కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. జీవవైవిధ్య పరిరక్షణ దిశగా సంరక్షణ, పరిశోధన, అధ్యయన రంగాలకు ఉపయుక్తంగా ఈ జీవవైవిధ్య సదస్సు ఉపయోగపడుందని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, యువ సైంటిస్టులకు జీవ వైవిధ్యం కోసం పని చేయాలని మంత్రి సురేఖ సూచించారు. అడవులు, పచ్చిక బయళ్ళు, తడి నేలలు, వృక్షాలు, జంతువులు ఇలా అనేకం తెలంగాణలో ఉన్నాయని అన్నారు. జీవవైవిధ్యం పర్యావరణ సమతుల్యతను సంరక్షించడం మన బాధ్యత అని తెలిపారు. అందుకోసం సమిష్టి కృషి జరగాలని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మానవ తప్పిదం వల్ల మొక్కలు, జంతువులు అంతరించిపోయే దశలో ఉన్నాయని అయితే, వాటి సంరక్షణ కోసం మానవులుగా మనమే కృషి చేయాలని చెప్పారు. ఒక జాతి అంతరిస్తే దానిలోని జన్యుసంపద అంతరించినట్లే జీవ వైవిధ్యపు నిజమైన విలువంతా జన్యువుల్లో నిక్షిప్తమై ఉంటుందని మంత్రి సురేఖ కీలక వ్యాఖ్యలు చేశారు. మన దేశంలో రాష్ట్ర ప్రభుత్వాలు, చాలా సంస్థలు జీవ వైవిధ్య సంరక్షణలోనూ దాన్ని ప్రతిభావవంతంగా వినియోగించడంలోనూ నిమగ్నమై ఉన్నాయని స్పష్టం చేశారు. కాగా, ఈ నేషనల్ బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్ – 2025. ఫిబ్రవరి 20, 21, 22 తేదీలలో రంగారెడ్డిలో మూడు రోజుల పాటు జరగనుంది.

# ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట నిఘా

## మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట నిఘా కొనసాగాలని మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్ తెలిపారు. గురువారం మహాదేవపూర్ మండలంలోని బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, అన్నారం, పలుగుల,పూసుకు పల్లి, ముద్దుల పల్లి లలో ఇసుక రీచ్ లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24/7 ఇసుక కోసం ఆన్లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఈ సేవల ద్వారా ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా ఇసుక లభించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. రీచ్‌లలో ఇసుక తీయు కార్యకలాపాలను సమీక్షించడంతో పాటు, ప్రతి రోజు ఎన్ని టన్నుల ఇసుక తీస్తున్నారని, రవాణా జరుగుతుందని టీఎస్ ఎండిసి, మైనింగ్ అధికారులను అడిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 24/7 ఆన్లైన్ ప్రక్రియ ద్వారా ఇసుక కొరత లేకుండా బుకింగ్ చేయడానికి అవకాశం కల్పించామని తెలిపారు. ఆయా ఏరియాల్లో ఇసుక స్టాకు, గోదావరిలో ఇసుక తీయు విధానాన్ని పరిశీలించారు. స్టాకు పాయింట్, రీచ్ లకు వచ్చు వాహనాలు, లోడింగ్ తో వెళ్ళు మార్గాలల్లో సిసి కెమెరాలు ఏర్పాటు ద్వారా పటిష్ట పర్యవేక్షణ చేయడానికి సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్, సోలార్ యూనిట్లు ఏర్పాటు ద్వారా విద్యుత్తు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. రోజు వారీ ఎంత ఇసుక రవాణా జరుగుతుందనే వివరాలు అడిగి తెలుసుకున్న కార్యదర్శి 8 నుండి 10 వేల మెట్రిక్ టన్నులకు పెంచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్ వాహనాలు నిలుపుదల చేయడం వల్ల రైతులకు, ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని రవాణాను నియంత్రణ చేసేందుకు ఇసుక స్టాక్ ఏర్పాటుకు అలాగే వాహనాలు నిపుదలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇసుక కొరత రాకుండా రాష్ట్రవ్యాప్తంగా నూతన ఇసుక రీచ్ లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వర్షాకాలాన్ని



దృష్టిలో పెట్టుకొని ఇసుక కొరత రాకుండా స్టాక్ నిల్వలు పెంచి ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గోదావరి నుండి ఇసుక తీయటానికి యంత్రాలను పెంచాలని ఆయన సూచించారు. ఇసుక రవాణాకు నిర్దేశించిన అదనంగా 3 గంటలు కేటాయిస్తామని నిర్దేశించిన లక్ష్యం మేర ఇసుక రవాణ చేయాలని ఆయన ఆదేశించారు. నిర్దేశించిన స్టాకు ప్రకారం ఇసుక తరలించేందుకు వాహనాలుకు అనుమతి ఇవ్వాలని తెలిపారు. కాంట్రాక్టురుకు కమిషన్ చెల్లింపు లు క్రమం తప్పకుండా చెల్లిస్తామని ఇసుక తీయుటకు అదనపు యంత్రాలు ఏర్పాటు చేయాలని, ఇసుక నిల్వలు పెంచాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. లారీలు కాంటా వేసేందుకు అదనపు వేయింగ్ మిషన్ ఏర్పాటు చేయాల్సి ఉన్నదని, ప్రత్యామ్నయంగా ప్రయివేటు వేయింగ్ మిషన్ ను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఇసుక రవాణా, లభ్యతపై కఠినమైన నిఘాతో అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామని అన్నారు. వాహనాలు రద్దీ నియంత్రణకు, నిలిపి ఉంచకుండా వాహనాలు నియంత్రణ చేసేందుకు ఆన్లైన్ బుకింగ్ ప్రకారం.క్రమపద్ధతిలో వాహనాలు రీచ్ కు వచ్చే విధముగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెకింగ్ పాయింట్ ఏర్పాటు ద్వారా నిశిత పరిశీలన జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజి ఎంఐడిసి విసి అండ్ ఎండి సుశీల్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, టీఎస్ఎం ఐడిసి పిఓ రంగారెడ్డి, మైనింగ్ ఎడి జయరాజు, తహసీల్దార్ ప్రహ్లాద రాథోడ్, నాయబ్ తహసీల్దార్ కృష్ణ ఇతర విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మీ సేవా కేంద్రాలో అదనపు రుసుము తీసుకుంటే చర్యలు

## ఈడీఎం శ్రీకాంత్ వెల్లడి





జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): మీ సేవా కేంద్రాల సేవలకు నిర్దేశించిన రుసుము కంటే అదనంగా తీసుకుంటే చర్యలు తీసుకుంటామని ఈడీఎం శ్రీకాంత్ తెలిపారు. గురువారం మొగుల్లపల్లి, చిట్యాల మండల కేంద్రాలలో మీ సేవ కేంద్రాలని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సేవల అందుబాటు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే సంబంధిత అధికారులను సంప్రదించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజలకు అంతరాయం లేకుండా సేవలు అందించాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించడమే మీ సేవా కేంద్రాల కర్తవ్యం తెలిపారు. మీ సేవా కేంద్రాల ద్వారా అందించు సేవలకు సంబంధించి ధరల పట్టిక ఏర్పాటు చేయాలని మిర్వహకులను ఆదేశించారు.

# నిక్మా హెల్త్ కేర్ సెంటర్ లో డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ డా. ప్రమీల తనిఖీ





మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): నిక్మా హెల్త్ కేర్ సెంటర్ (వెంకటేశ్వర నర్సింగ్ హోమ్) మహబూబాబాద్ తనిఖీ చేసిన డాక్టర్ ప్రమీల డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి మురళీధర్ ఆదేశాల మేరకు గురువారం డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రమీల నిక్మా హెల్త్ కేర్ సెంటర్ ని తనిఖీ చేసారు. హాస్పిటల్ రికార్డ్స్ ను పరిశీలించుతూ ఇన్ పేషెంట్స్ వివరాలను,రిజిస్టర్ ఔట్ పేషెంట్స్ రిజిస్టర్, పేషెంట్స్కిస్తున్న సేవలను గురించి, ల్యాబ్ పరీక్షల అన్ని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కెవి రాజు, గీత పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపుకు కృషి చేయాలి

**ప్రతి ఓటరును ఇంటి, ఇంటికి వెళ్లి కలవాలి**

**నిరంతరం సమీక్ష, సమన్వయంతో పని చేయండి**

**సమావేశంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



పరకాల, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి విజయానికి కృషి చేయాలని, దానికి గ్రామాల కో-ఆర్డినేటర్ లు సమిష్టిగా, సమన్వయంతో పని చేయాలని పరకాల ఎమ్మెల్యే, హుజురాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జి శ్రీ.రేవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో ఇళ్ళందకుంట, జమ్మికుంట మండల కో-ఆర్డినేటర్ ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టభద్రుల హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఓటరును నేరుగా ఇంటికి వెళ్లి కలవాలని, పట్టభద్రుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధి ఉందని, పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో నరేందర్ రెడ్డి గట్టిగా కొట్లాడతారని అన్నారు. అలాగే 50 ఓటర్స్ కి ఒకరు ఇన్చార్జిగా బాధ్యతలు తీసుకొని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు నకు కృషి చేయాలి అన్నారు. ప్రచారం చేసే సమయంలో వారి సమస్యలు తెలుసుకోవాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలి




**మాదక ద్రవ్యాల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): జిల్లాలో మాదక ద్రవ్యాలను నియంత్రించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం ఐ.డి.ఓ.సి లోని కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్, స్థానిక సంస్థల, రెవెన్యూ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మాచారి లతో కలిసి సంబంధింత అధికారులతో జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ సెంటర్ కమిటీ (ఎన్‌కార్డ్)సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు పోలీసశాఖ కృషి చేస్తోందని, వాటికి ఇతర శాఖలన్నీ సహకారం అందించాలన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను అరికట్టే దిశగా దృష్టి సారించాలని, గంజాయి ఒక సామాజిక దురాచారంగా తయారైందన్నారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు కళాజాత బృందాలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించాలని అన్నారు. సంక్షేమ హాస్టళ్ళలోని విద్యార్థులకు, వీటిపై అవగాహనా కల్పించేందుకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని, పాఠశాల విద్యార్థులకు ప్రార్థన సమయాలలో పలు సందేశాలతో అవగాహన కల్పించాలని, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతీ పట్టణ మండల, గ్రామ స్థాయిలో రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కలిసి మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ సుధీర్ రాం నాథ్ కేకన్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేకించి గంజాయి వివిధ మార్గాల ద్వారా రవాణాలో ఉందని, వాటిపై పోలీసు యంత్రాంగం ఎప్పటికప్పుడు నిఘా పెట్టి నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని, దీనికి ఇతర శాఖలనుండి కూడా సహకారం అందించాలన్నారు. మాదకద్రవ్యాల రవాణా మరియు ఉత్పత్తి చేయడం చట్టవ్యతిరేకమైన చర్య అని, జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఈ మాదకద్రవ్యాల సరఫరా ఎక్కువగా ఉన్నదని అటువంటి ప్రాంతాల్లో పోలీసు శాఖ ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతుందని, ఇట్టి చర్యలకు పాల్పడిన వారు కఠినంగా శిక్షించ బడుతారని తెలిపారు. ప్రజలు ముఖ్యంగా యువతీ, యువకులు ఈ మాదకద్రవ్యాల బానిసై తమ ఉన్నత భవిష్యత్తును నాశనం చేసుకోరాదని కోరారు.

అదే విధంగా గంజాయికి బానిసైన వారి కోసం మెడికల్ విభాగం ఆధ్వర్యంలో డీఅడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి వినయోగం ఎక్కడ కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రతీ పాఠశాలలో,కాలేజీల్లో మాదక ద్రవ్యాలపై యువతకు అవగాహన పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీవోలు కృష్ణవేణి, గణేష్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ లకావత్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు డీఎంహెచ్‌వో డాక్టర్ మురలీధర్, డ్రగ్ ఇన్స్పెక్టర్ ఉమారాణి, జిల్లా టి.బి. కంట్రోల్ అధికారి డాక్టర్ వెంకట్రాములు, ట్రైబల్ వేల్ఫేర్ డి.డి దేశీరాం, డి.ఐ.ఈ.ఓ మాదార్, బి.సి డెవేలప్మెంట్ అధికారి నరసింహస్వామి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, ప్రభుత్వ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ లీల, విద్యశాఖ అధికారి శ్రీరాములు సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నర్సిరెడ్డిని గెలిపించాలని ప్రచారం





హనుమకొండ కేయు, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి విజ్ఞప్తి చేశారు. నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ కాకతీయ యూనివర్సిటీలో ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. గతంలో ఉపాధ్యాయ, అధ్యాపకుల మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికైన నర్సిరెడ్డి నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయ అధ్యాపక గొంతుకగా నిరంతరం పనిచేస్తున్నారు. ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం, విద్యాసంస్థల బలోపేతం కోసం శాసనమండలిలో బయట శక్తి వంచన లేకుండా కృషి చేశారని, కేజీబీవీ, యుఆర్ఎస్ లో పనిచేస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగులకు వేసవి సెలవులతో సహా 12 నెలలు జీతం వచ్చేలా చేయడంలో తెలంగాణ మొదటి పి ఆర్ పి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కూడా వర్తింప చేయడంలో 180 రోజుల ప్రసూతి సెలవులు సాధించడంలో ఆయన కృషి చేశారని, బేసిక్ పే సాధన కోసం కృషి చేస్తున్నారని, గత పది సంవత్సరాలుగా మోడల్ స్కూల్లో టీచర్ల సమస్యల పరిష్కారం కోసం, బదిలీలు ఏర్పాటు చేయాలని పోరాటం చేశారని, గురుకుల పాఠశాలలో నూతన నియమకాలు చేపట్టాలని, ప్రభుత్వంపై ఒత్తిడి చేశారని, శ్రమకు తగిన వేతనాలు టైం, టేబుల్ సవరించాలని సకాలంలో వేతనాల చెల్లింపు, ప్రభుత్వ జూనియర్ డిగ్రీ పాలిటెక్నిక్ కళాశాల కాంట్రాక్టు లెక్చరర్స్ రెగ్యులరైజేషన్ చేయడంలో, యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం, పోరాటాలు నిర్వహిస్తున్న నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# వేసవిలో త్రాగునీటి సరఫరా ఇబ్బందులు రాకుండా చర్యలు

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ములుగు జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): జిల్లాలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశము మందిరంలో జిల్లా వ్యాప్తంగా రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొనేందుకు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలం వారిగా మండలంలో ఎన్ని పైప్ లైన్ లు ఉన్నాయి, పని చేస్తున్నాయా, ఏమైనా సమస్యలున్నయా పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రానున్న వేసవి కాలాన్ని ద్రుష్టి లో ఉంచుకొని నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని, వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాను నిరంతరం కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని, మండలంలలో ఉండే పైపు లైన్లు, బోర్లు పని తీరును పరిశీలించి ఎక్కడైనా పైప్ లైన్ లు లీకేజీ ఉంటె వాటికీ మరమ్మతు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో నీటి



వనరుల స్థితిగతులను పర్యవేక్షించేందుకు స్థానిక అధికారులను బాధ్యతగల వ్యక్తులుగా నియమించాలని, వేసవి కాలంలో నీటి సరఫరా విషయంలో ఎలాంటి సమస్య ఏర్పడకుండా చూడాలని అన్నారు. గత ఏడాది జిల్లాలో ఎక్కడెక్కడ నీటి సమస్య తలెత్తయో ఆ ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఈ ఏడాది వేసవి సీజన్ ముగిసేంత వరకు ఏదైనా నివాస ప్రాంతంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు గమనించిన వెంటనే, ముందస్తుగానే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. బోరుబావుల మరమ్మతులు చేపట్టే మెకానిక్ కు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, బోరు చెడిపోయిందన్న సమాచారం అందిన వెంటనే గంటల వ్యవధిలోపు మరమ్మతులు పూర్తి చేయించి దాహార్తి సమస్య ఏర్పడకుండా సత్వరమే పనులు జరిపించాలన్నారు. తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు చేపడుతున్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఏర్పడితే గ్రామ పంచాయతీలకు చెందిన ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే పక్క జీ.పీకి చెందిన ట్యాంకర్ ను కూడా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకితభావంతో పని చేయాలని, నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్.ఈ. మల్లేశం, ఈ ఈ సుభాష్, డి పి ఓ దేవ్ రాజ్, ఆర్ డబ్ల్యూఎస్ డి ఇ లు, ఎంపీడీవోలు, ఏం పి ఓ లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

## మార్చి 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు పరీక్షలు నిర్వహణ

## 17 పరీక్షా కేంద్రాలలో 8945 మంది పరీక్షలకు హాజరు



జనగామ జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్. మార్చి 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరముల పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ సమన్వయ సమావేశానికి ఏసిపి పండారి నితిన్ చేతన్ ఇంటర్మీడియట్ పరీక్షల నోడల్ అధికారి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆధ్వర్యంలో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరముల వార్షిక పరీక్షలు 2025 మార్చి 5వ తేదీ నుండి మార్చి25వ తేదీ వరకు 17 కేంద్రాలలో నిర్వహిస్తున్నామని, పరీక్షలు రాసేందుకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 4251మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4694 మంది మొత్తంగా 8945 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. జనగామ మున్సిపాలిటీ పరిధిలోని 9 పరీక్ష కేంద్రాలు ఉన్నట్లు తెలియజేస్తూ, మూడు పరీక్ష కేంద్రాలు స్టేషన్ఘన్పూర్ లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మిగిలిన 5 పరీక్ష కేంద్రాలు నర్మెట్ట, దేవరుప్పుల, జాఫర్గడ్, పాలకుర్తి, కొడకండ్ల మండలాల్లో ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించే పరీక్షల నిర్వహణకు ఉదయం 8గంటల వరకే చేరుకోవాలని తెలియజేసారు. సంబంధిత అధికారులు కేటాయించిన విధులను అత్యంత జాగ్రత్తతో అప్రమత్తంగా నిర్వహించాలన్నారు. ప్రశ్నాపత్రాల తరలింపు లో అత్యంత భద్రత తీసుకోవాలన్నారు. విద్యార్థులు సమయానుకూలంగా పరీక్షా కేంద్రాలకు చేరే విధంగా ఆర్టీసీ బస్సులు నడపాలని, నిరంతరం పరీక్ష కేంద్రాలలో విద్యుత్తు సరఫరా కు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీ, గ్రామపంచాయతీ పరిధిలో, త్రాగునీరు శానిటేషన్ సౌకర్యాలు అన్ని పరీక్ష కేంద్రాలలో వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రశ్నాపత్రాల కవరు శీలు తీయటం, జవాబు పత్రాలను కవరులో ఉంచి శీలు వేయడం సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. చీఫ్ సూపరింటెంట్ కి తప్ప మిగతా వారికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్షా కేంద్రాల ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ పరీక్ష కేంద్రాలలో ఆకస్మికంగా సందర్శిస్తూ పరీక్షల నిర్వహణ సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సంబంధిత అధికారి చే జారీ చేయబడిన ఐడి కార్డులు ఉంటేనే తప్ప ఇతరులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని, ఏవైనా సందేహాలు ఉంటే టెలి మానస్ ను సంప్రదించాలన్నారు. ఆన్లైన్ సౌకర్యం కల్పించి టోల్ ఫ్రీ నెంబర్ 14416 ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కలెక్టరేట్లో కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని,ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు నిరంతరంగా పనిచేస్తుందని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి దినేష్ రెడ్డి, జిల్లా వైద్య అధికారి మల్లికార్జునరావు, విద్యాశాఖ అధికారి రమేష్, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సామాజిక కార్యకర్త హత్య పట్ల స్పందించిన తీన్మార్ మల్లన్న టీం



భూపాలపల్లి, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి జంగేడు గ్రామంలో నివసించే నాగవల్లి రాజలింగమూర్తి నిన్న సాయంత్రం ఒక శుభకార్యానికి వెళ్లి వస్తుండగా రెడ్డి కాలనీ రోడ్డు దగ్గర కొందరు గుర్తు తెలియని దుండగులు కత్తులతో విచక్షణ రహితంగా పొడిచి పారిపోవడం జరిగింది కత్తిపోట్లకు కడుపులో ఉన్న పేగులు బయటికి రావడం జరిగింది విపరీతమైన రక్తస్రావం కొద్దిసేపు విలపించి అక్కడికక్కడే రాజలింగమూర్తి మృతి చెందడం జరిగింది. భూపాలపల్లి జిల్లాలో అనేక గవర్నమెంట్ భూముల మీద మరియు ప్రైవేట్ కంపెనీల మీద న్యాయస్థానాలలో రాజలింగమూర్తి కేసులు వేయడం జరిగింది. వాటికి అలాగే ప్రతిష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టు మీద కేసు వేసి అందులో మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావు హరీష్ రావు తారక రామారావు లాంటి వారి మీద ప్రైవేట్ కేసు వేయడం జరిగింది. ఇలా ఎన్నో సమస్యల మీద చట్ట ప్రకారంగా పోరాడుతున్న రాజలింగమూర్తిని చంపడం అమానుషం అని తీన్మార్ మల్లన్న టీం జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ అన్నారు. ప్రశ్నించే వారిని చంపడం అనేది సమంజసం కాదని దీన్ని తీవ్రంగా తీన్మార్ మల్లన్న టీం ఖండిస్తుంది దోషులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని మళ్లీ భూపాలపల్లిలో ఇలాంటి హత్యలు పునరావృతం కావద్దని భూపాలపల్లి ప్రజలు కూడా భయాందోళనలో గురవుతున్నారని ఇలాంటి సంఘటనలు ఎవరు చేసిన సహించేది లేదని రవి పటేల్ అన్నారు. రాజలింగమూర్తిని హత్య చేసిన వారిని ఎవరినైనా వదలకుండా వారితో ఎంతమందికి సంబంధాలు ఉన్నాయో వారందరినీ కూడా చట్టప్రకారం శిక్షించాలని రవి పటేల్ డిమాండ్ చేశారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ జిల్లా నాయకులు ప్రణయ్ సమ్మయ్య సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): మార్చి 5 నుండి ప్రారంభ మయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తో కలిసి సమావేశం నిర్వహించారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలలోకి ఎవరు సెల్ఫోన్ తీసుకొని వెళ్లడానికి అనుమతి లేదని గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా అవసరమైన రూట్ లలో బస్సు సర్వీసులు నడిచేలా చేపట్టాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో ఒక ఏఎన్ఎంను కేంద్రాల వద్ద అందుబాటులో ఉండేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాలలో తాగునీరు తదితర మౌలిక వసతులు ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షలను సజావుగా నిర్వహించడానికి ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లను చేర్చడం ద్వారా కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగానే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రాల ఏరియాలలో జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన నిఘా ఉండాలని, ఇందుకు గాను కస్టోడియన్ మరియు డిపార్ట్మెంటల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, ఏ ఆర్ డి ఎస్ పి సత్యనారాయణ, టేకులపల్లి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ సులోచన రాణి కొత్తగూడెం ఇల్లందు పాల్వంచ మున్సిపల్ కమిషనర్లు శేషంజన్ స్వామి, శ్రీకాంత్,సుజాత తదితరులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ మంత్రిని నియమించడంలో రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం

### ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడాలి

### పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు : కాంపాటి పృథ్వీ




భద్రాచలం, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ విద్యారంగానికి కనీసం ఓ ప్రత్యేక శాఖను నియమించకుండా జాప్యం చేస్తూ విద్యారంగాన్ని గాలికి వదిలేసి కేసిఆర్ అడుగుజాడల్లోనే రేవంత్ రెడ్డి ప్రయాణం చేస్తున్నాడని పిడియస్యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. గురువారం భద్రాచలం జూనియర్ కళాశాల విద్యార్థులు పిడియస్యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి పి డి యస్ యూ భద్రాచలం డివిజన్ కార్యదర్శి మునిగల శివప్రశాంత్ అధ్యక్షత వహించగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయిందని ఎటువంటి పట్టింపులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుంటున్నది అని వారు కాంగ్రెస్ ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. ఒకపక్క గురుకుల విద్యాలయాలలో ఫుడ్ పాయిజన్ తో విద్యార్థులు మరణిస్తుంటే మరోపక్క ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటిలో అర కొర సౌకర్యాలు, అధ్యాపకుల లేమి, మంచినీరు సమస్య, సరిపోనీ తరగతి గదులు, శిథిలావస్థలో బిల్డింగులు, అద్దె భవనాల్లో విద్యాసంస్థల నిర్వహణ లాంటి లోపాలతో ప్రభుత్వ విద్యా సంస్థలు కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వ చేయూత ఏమాత్రం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ విద్యాసంస్థల నిర్వహణకు ఉద్యోగుల జీతభత్యాలకు కూడా సరిపోని స్థితి ఉన్నదని ఈ సందర్భంలో ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే కొత్త సీసాలో పాత సార చందంగా విద్యార్థులకు పాత సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలు తోడై స్వాగతం పలుకుతున్నాయని అన్నారు. అంతేకాకుండా సంవత్సరాల తరబడి స్కాలర్షిప్స్ ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని అమలు చేయకుండా వేల కోట్ల రూపాయలను పెండింగ్ లో ఉంచి విద్యార్థులకు మొండి చేయి చూపిస్తున్నారని తెలిపారు. విద్యారంగంలో కొంతమేరకైనా సమస్యలు పరిష్కరించబడాలి అంటే కొఠారి కమిషన్ సూచించిన మేరకు రాష్ట్ర బడ్జెట్లో 30 శాతం నిధులు కేటాయించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగం పట్ల చిత్తశుద్ధి చాటుకోవాలని వారి డిమాండ్ చేశారు. విశ్వ విద్యాలయాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల నూతన ముసాయిదాను ప్రవేశపెట్టి వీసీల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి అధికారాలు లేకుండా కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించే వ్యక్తులను వైస్ ఛాన్సలర్ గా నియమించి విశ్వవిద్యాలయాలలో హిందుత్వ ఆధిపత్యాన్ని పెంచుకునేందుకు కుట్రలో భాగంగానే నూతన ముసాయిదాను తీసుకొచ్చిందని దీనిని రాష్ట్ర ప్రభుత్వం ఖండించి చేతులు దులుపుకోవడం కాకుండా అడ్డుకోవాలని వారు సూచించారు.

అమెరికాలో భారత విద్యార్థులపై ట్రంప్ దుశ్చర్యలను ఖండించాలని, భారత పౌరుల చేతులకు సంకెళ్లు వేసి అవమానపరుస్తుంటే దేశ ప్రధాని మోడీ ఎందుకు నోరు తెరవడం లేదని వారు ప్రశ్నించారు. భారత పౌరులు అవమానానికి గురికాకుండా గౌరవంగా దేశానికి తరలించే చర్యలు చేపట్టాలని మోడీని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని,విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

## బీసీ సంక్షేమ జిల్లా అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలి

### కమిషనర్ అనుమతి లేకుండా ప్రభుత్వ నిధులను కాజేసిన ఘనాపాటి

### పిల్లల పైసలు సైతం పీక్కుతింటున్న పిశాచి

### రేపటిలోగా సస్పెండ్ చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం

### బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



వనపర్తి, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): అనేక అవినీతి అక్రమాలకు పాల్పడటమే కాకుండా ప్రభుత్వ నిధులను కాజేసిన వనపర్తి జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి బీరం సుబ్బారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుని కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీ కార్పోరేషన్ కమిషనర్ అప్రూవల్ లేకుండా దాదాపు 16 లక్షల రూపాయలు తన డ్రైవర్, అటెండర్ల పేరు మీద చెక్కు రాసి డ్రా చేశారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. బీసీ కార్పోరేషన్లో జమ అయిన నిధులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న బీసీలకు ఇవ్వాలని, ఏదైనా ఖర్చు చేయాలంటే తప్పనిసరిగా కమిషనర్ అనుమతి ఉండాలని నిబంధనలు ఉన్నప్పటికి అవేమీ పట్టించుకోకుండా తన స్వంతానికి వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆతనిపై అనేక ఆరోపణలు వచ్చినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తూ వచ్చారని, దీంతో ఆదికారి ఆగడాలు మరీ ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు హాస్టల్ విద్యార్థులకు అన్యాయం చేశాడని ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారని, ఈ కేసు పెండింగ్లో ఉండగా వనపర్తి జిల్లాకు అసిస్టెంట్ జిల్లా అధికారిగా బదిలీ చేయడమే కాకుండా ఇంచార్జి బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిగా మరియు ట్రైబల్ వెల్ఫేర్ ఇంచార్జ్ జిల్లా అధికారిగా నియమించడం జరిగిందన్నారు. అంతేకాకుండా డబ్బులు తీసుకుని దాదాపు ఆరుగురుకి అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు కల్పించాడని ఆరోపణలు ఉన్నాయన్నారు. హాస్టళ్లలో పనిచేసే ఐదుగురు ఉద్యోగులను తన స్వంత అవసరాలకు ఉపయోగించుకోవడమే గాక, ఒకరి బదులు మరొకరిని డ్యూటి చేయిస్తున్నాడన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే మెస్ బిల్లులో ప్రతి విద్యార్థి నుంచి ప్రతినెల 50 రూపాయలు ఇవ్వాలని హాస్టల్ వార్డెన్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యార్థుల కడుపు కొట్టే అధికారులను ఉపేక్షించేది లేదని, జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే అతనిని సస్పెండ్ చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి జిల్లా అధ్యక్షులు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, ఆర్టీఐ విభాగం అధ్యక్షులు గుర్రం రాఘవేందర్ కొత్తకోట మండల అధ్యక్షులు అంజన్న యాదవ్, ఆత్మకూర్ మండల ప్రధాన కార్యదర్శి అక్కల మల్లేష్ గౌడ్,దేవర శివ, చెలిమిల్ల రామన్ గౌడ్, కిరణ్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి



వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. కలెక్టరేట్లోని తన చాంబర్లో గురువారం అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపి రవిందర్ లతో కలిసి మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మత్తు పదార్థాల నియంత్రణ పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని 16 పీఎం శ్రీ ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రచించాలని, అవగాహన, చైతన్యం కల్పించడం వల్ల సమాజంలో మార్పును తీసుకు రావచ్చునని అన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు గురించి, ఇప్పటివరకు ఎన్ని కేసులు నమోదయ్యాయనే వివరాలను పోలీసు, ఎక్సైజ్, టిఎస్ న్యాబ్, అటవీ, జీఆర్పీ పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్ సెంట్రల్ జోన్ డిసిపి రవీందర్ మాట్లాడుతూ ప్రతి నెల నార్కోటిక్ కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మత్తు పదార్థాల కు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100, సమీప పోలీస్ స్టేషన్ కు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ ఓ విజయలక్ష్మి, డీఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చందర్, ఎఫ్ ఆర్ ఓ సందీప్, నార్కోటిక్స్ డిఎస్పీ సైదులు, డ్రగ్స్ ఇన్స్పెక్టర్ అరవింద్ కుమార్, టీఎస్ న్యాబ్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కర్ణవేదన వేడుకలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఏటూరునాగారం, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): గురువారం పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాలమేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలమేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిటమట రఘు ఆధ్వర్యంలో ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన గాడిచర్ల నారాయణ -మంగమ్మ ల కూతురు ఆరాధ్య కర్ణవేదన మరియు వారి కుమారుడు అభిరామ్ మొదటి జన్మదిన వేడుకలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన ఏటూరునాగారం మండల కాంగ్రెస్ నాయకులు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్,బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింగరావు, మాజీ సర్పంచ్ చేల వినయ్ కుమార్, మండల ఎస్సి సెల్ అధ్యక్షులు కర్నె సత్యం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గద్దల నవీన్,సోదారి హరీష్, వావిలాల బిక్షపతి, దుర్గం అర్జున్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి వారం అధికారులు పాఠశాలలు, వసతి గృహాల తనిఖీలు చేయాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



జనగాం జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): ప్రత్యేక అధికారులు, తహసీల్దార్ లు, ఎంపిడిఓలు, క్లస్టర్, నోడల్ అధికారులందరూ రోజూ వారి శాఖ పరమైన కార్యకలాపాలతో పాటు ప్రతి శుక్రవారం రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి, ఆయా రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల పరిశుభ్రతా ప్రమాణాలు, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థుల శ్రేయస్సు, ఆహార భద్రత, తదితరాల వంటి వాటిని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనాలు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకుముందు ఎలాగైతే ప్రతి బుధవారం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, పర్యవేక్షించారో అదే విధంగా ఇప్పుడు కూడా జిల్లా యంత్రాంగమంతా రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల పర్యవేక్షణలో భాగస్వాములు అయ్యి విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించడంతో పాటు, ఉన్నత ప్రమాణల తో కూడిన విద్య అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కలిసి శ్రమిద్దాం

**రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో గురువారం జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీ సమీక్షా సమావేశం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధ్యక్షతన జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ తో కలిసి నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ముందుగా రోడ్డు భద్రతకు సంబంధించి, తీసుకుంటున్న చర్యల గురించి సంబంధిత శాఖ అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మోటారు వాహనాలు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్ గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల భారిన పడిన వారి కుటుంబ సభ్యులు అనాథలవుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, ఆర్అండ్బీ, వైద్యశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేసి, జైలు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పోలీసు శాఖను ఆదేశించారు. జాతీయ రహదారిలో ప్రమాదాల నివారణకు రబ్బరు వేగ నియంత్రికలు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని రవాణాశాఖను ఆదేశించారు. రహదారుల కూడళ్లు, ధాబాలు, రెస్టారెంట్లలో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అన్ని శాఖలు కలిసి సమన్వయంతో శ్రమిద్దామని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలోట్రైబల్ వెల్ఫేర్ ఈ ఈ భద్రాచలం చంద్రశేఖర్, ఆర్ అండ్ బి ఈ ఈ లు కొత్తగూడెం, భద్రాచలం వెంకటేశ్వర్లు, లాల్ సింగ్, పంచాయతీరాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఇల్లందు శ్రీకాంత్, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్టీవో వెంకటరమణ,ఎం వి ఐ వెంకట పుల్లయ్య, కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, డి ఎం హెచ్ ఓ భాస్కర్ నాయక్ , నేషనల్ హైవే డి ఈ శైలజ, మెడికల్ డిపార్ట్మెంట్ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు



మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా నీటి ఎద్దడి ఏర్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి ఎంపీఓ, ఎం.పి.డి.ఓ లు మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటి ఎద్దడి నెలకొన్న ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అందుకుగాను సమస్యాత్మక ప్రాంతాల్లో పైప్ లైన్లు మరమ్మత్తులు చేయించి నీటి ఎద్దడిని నివారించాలన్నారు. వేసవి కాలంలో నీటి సరఫరాలో సమస్యలు ఎక్కడ ఉత్పన్నమవుతాయో గుర్తించి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. లీకేజీ మరమ్మతులు ఏమైనా ఉంటే వాటిపై దృష్టి పెట్టి ఎక్కడ కూడా త్రాగునీటి సరఫరాలో సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలో అధికారులు సమన్వయంతో పనిచేసి రాబోయే వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ప్రణాళిక బద్ధంగా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా నీటి పంపులు, మోటర్లు, వాల్స్ లు పైపులకు సంబంధించి మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో ఆయా గ్రామాలను నీటి సరఫరా అధికారులు సందర్శించి అందుకు కావలసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నీరు వృధా కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీ.ఈ.ఓ పురుషోత్తం, డి.పి.ఓ హరిప్రసాద్, మిషన్ భగీరథ ఈ.ఈ కృష్ణారెడ్డి, ఎం.పి.ఓ, ఎం.పి.డి.ఓ లు, వివిధ శాఖల అధికారులు, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల అభివృద్ధికి నైపుణ్య శిక్షణాభివృద్ధి కేంద్రం ఏర్పాటు

## హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదెల్లలోని సాగునీటి పారుదల శాఖకు సంబంధించిన పాత భవనాలు ఖాళీగా ఉండటంతో అందులో మహిళలు ఆర్థిక అభివృద్ధిని సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణాభివృద్ధి కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. గురువారం ల్యాదెల్ల గ్రామంలోని సాగునీటి పారుదల శాఖ సంబంధించిన భవనాలను వివిధ శాఖల అధికారులతో కలిసి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులతో కలెక్టర్ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు ఆసక్తి ఉన్న రంగాలలో పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో పాటు వారికి నైపుణ్యాభివృద్ధిని సాధించే విధంగా నైపుణ్యాభివృద్ధికి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ఇరిగేషన్ కు చెందిన పాత భవనాలకు మరమ్మతు పనులతో పాటు తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, టాయిలెట్స్, విద్యుత్తు, లైటింగ్, పెయింటింగ్, తదితర పనులు పూర్తి చేసినట్లయితే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంతో పాటు చిన్న తరహా ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయవచ్చునని పేర్కొన్నారు. మండలంలోని స్వయం సహాయక సంఘాలకు కావాల్సిన శిక్షణ, వనరులను సమకూర్చేందుకు పరిశీలించినట్లు తెలిపారు. వి- హబ్, పరిశ్రమలు, ఐటి శాఖలతో ఒప్పందం చేసుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు



చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రంతో పాటు చిన్న తరహా ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై చర్చించనున్నట్లు చెప్పారు. ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖలు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను తయారు చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ జనపనార (జ్యూట్) సంచుల తయారీ, ఇతర జ్యూట్ ఉత్పత్తులను మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టేందుకు, మహిళలకు మిషన్, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ, బ్రాండింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, కుట్లు అల్లికలు, మగ్గం, రెడీమేడ్ దుస్తుల తయారీ, కంప్యూటర్, తదితర అంశాలలో శిక్షణను ఇచ్చేందుకు ఈ శిక్షణ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో మేన శ్రీను, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్త్రీ నిధి రికవరీ వేగవంతంగా ఉండాలి

**సిబ్బంది పనితీరు మెరుగు పర్చుకోవాలి**

**స్త్రీనిధి రికవరీలో నిర్దేశించుకున్న లక్ష్యాలు నెరవేర్చాలి**

**రికవరిలో జాప్యం సరికాదు**

**ఆదేశించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

జనగామ జిల్లా, ఫిబ్రవరి 20 (తీన్మార్ న్యూస్): కలెక్టర్ కార్యాలయ మీటింగ్ హాల్లో గురువారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి ఆధ్వర్యంలో స్త్రీనిధి, మహిళా శక్తి, ఇందిరమ్మ క్యాంటిన్, బ్యాంక్ లింకేజి తదితర అంశాలపై అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ముందుగా స్త్రీనిధి కార్యకలాపాలపై సమీక్షిస్తూ రికవరీ లక్ష్యాల పై అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డిపిఎమ్, ఎపిఎమ్, సిసి లతో కలెక్టర్ సమీక్షిస్తూ కాలయాపన తగదన్నారు. రికవరీలపై పట్టు సాధించాలని నిరంతరం సమీక్షిస్తూ కఠిన చర్యలు తీసుకుంటేనే తప్ప సాధ్యం కాదని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ ప్రగతి సాధించాలన్నారు. మహిళా శక్తి పథకం ఎంపిక, ప్రగతి పై కలెక్టర్ సమీక్షిస్తూ పథకం విస్తృత పరచాలని లబ్ధిదారులు ఎంపిక వేగవంతంగా ఉండాలని, మార్చి నెలాఖరు లోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్నారు. ఇంటి నిర్మాణం కొరకు చేపడుతున్న ఇటుకల తయారీ యూనిట్ పై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, ఇటుకల తయారీ యూనిట్ ప్రారంభించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ పథకానికి లబ్ధిదారుల ను త్వరితగతిన గుర్తించి ఎంపిక చేయాలన్నారు. బ్రిక్ యూనిట్ స్థాపనకు లబ్ధిదారులను సందర్శింప చేయాలన్నారు. యూనిట్ పై పూర్తి అవగాహనా వచ్చిన తర్వాతనే బ్రిక్ యూనిట్ మంజూరు చేయాలన్నారు. ఇందిరా మహిళా క్యాంటీన్ లలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి మండలానికి ఒక మహిళా క్యాంటిన్ తప్పని సరిగా ఏర్పాటు చేయించాలన్నారు. సోలార్ యూనిట్లు రఘునాథపల్లి లో, పాలకుర్తి లలో ప్రారంభించెందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంక్ లింకేజిలో లక్ష్యాలు సాధించాలన్నారు. వెనుక బడిన మండలాలపై దృష్టి పెట్టాలని అధికారులకు తెలిపారు. ఈ సమీక్షసమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి వసంత ఉపాధి హామీ పథకం అ దనపు పిడి చంద్రశేఖర్, డిపిఎంలు ఏపిఎంలు సీసీలు పాల్గొన్నారు.



# ఎంట్రాప్రెన్యూర్‌లకు రూ.5 లక్షల పరిమితితో క్రెడిట్ కార్డులు

మొదటి పేజీ తరువాయి




ఇచ్చినట్లుగా మైక్రో ఎంట్రాప్రెన్యూర్‌లకు రూ. 5 లక్షల పరిమితితో క్రెడిట్ కార్డులను ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వం జారీ చేయనుంది. ఈ సౌకర్యం రాబోయే కొన్నేళ్లలో సూక్ష్మ-యూనిట్‌లకు అదనంగా రూ. 30,000 కోట్ల నిధులను అందించగలదు. ఇది వ్యాపార విస్తరణ కోసం ఇతర రుణ ఎంపికలకు అనుబంధంగా ఉంటుంది. ఈ పథకం నుండి ప్రయోజనం పొందడానికి, క్రెడిట్ కార్డు అందుకునేందుకు చిరు వ్యాపారులు నమోదు చేసుకోవాలి. ఈ నేపథ్యంలో రూ. 5 లక్షల పరిమితితో ఈ క్రెడిట్ కార్డును పొందడానికి అర్హత ప్రమాణాలు.

## క్రెడిట్ కార్డు లిమిట్, షరతులు

- రూ. 5 లక్షల లిమిట్ కలిగిన ఈ క్రెడిట్ కార్డ్ చిరు దుకాణాలను, చిన్న తరహా తయారీ పరిశ్రమలను నిర్వహించేవారికి అందుబాటులో ఉంటుంది.
- దరఖాస్తుదారుల యూపీఐ లావాదేవీలు, బ్యాంక్ స్టేట్‌మెంట్‌లు వ్యాపార పరిస్థితులు అంచనా వేసిన తర్వాత ఈ క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తారు.
- కార్డుకు ఒక సంవత్సరం చెల్లుబాటు వ్యవధి ఉంటుంది.
- రూ. 10-25 లక్షల మధ్య వార్షిక టర్నోవర్ ఉన్నవారు మాత్రమే ప్రభుత్వ మైక్రో-క్రెడిట్ కార్డుకు అర్హులు.

## దరఖాస్తు ప్రక్రియ

- ప్రభుత్వం జారీ చేసే ఈ క్రెడిట్ కార్డును పొందడానికి, దేశవ్యాప్తంగా ఉన్న చిరు వ్యాపారులు ముందుగా ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. అనంతరం ఎంఎస్ఎంఈ క్రెడిట్ కార్డును పొందవచ్చు. పోర్టల్‌లో నమోదుకు ఈ దశలు పాటించండి.
- అధికారిక ఉద్యమ్ పోర్టల్ msme.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.
- 'క్విక్ లింక్స్' పై క్లిక్ చేయండి.
- 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్' ఎంచుకోండి.
- రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయడానికి తదుపరి సూచనలను అనుసరించండి.

# పిల్లల పైసలు పీక్కుతింటున్న పిశాచి అధికారి

**బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలి**

**కమిషనర్ అనుమతి లేకుండా**

**ప్రభుత్వ నిధులను కాజేసిన ఘనాపాటి**

**రేపటిలోగా సస్పెండ్ చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం**

**బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**





దేవరకద్ర ప్రతినిధి,ఫిబ్రవరి20(తీన్మార్ న్యూస్) అనేక అవినీతి అక్రమాలకు పాల్పడటమే కాకుండా ప్రభుత్వ నిధులను కాజేసి పిల్లల పైసలు పీక్కుతింటున్న పిశాచి వనపర్తి జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి బీరం సుబ్బారెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు గురువారం వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ను కలిసి ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీ కార్పోరేషన్ కమిషనర్ అప్రూవల్ లేకుండా దాదాపు 16 లక్షల రూపాయలు తన డ్రైవర్, అటెండర్ల పేరు మీద చెక్కు రాసి డ్రా చేశారని,దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.బీసీ కార్పోరేషన్లో జమ అయిన నిధులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న బీసీలకు ఇవ్వాలని, ఏదైనా ఖర్చు చేయాలంటే తప్పనిసరిగా కమిషనర్ అనుమతి ఉండాలని, నిబంధనలు ఉన్నప్పటికి అవేమీ పట్టించుకోకుండా తన స్వంతానికి వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆతనిపై అనేక ఆరోపణలు వచ్చినా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తూ వచ్చారని,దీంతో ఆదికారి ఆగడాలు మరీ ఎక్కువయ్యాయని,ఆందోళన వ్యక్తం చేశారు.నాగర్ కర్నూల్ జిల్లాలో పనిచేస్తున్నప్పుడు హాస్టల్ విద్యార్థులకు అన్యాయం చేశాడని ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారని,ఈ కేసు పెండింగ్లో ఉండగా వనపర్తి జిల్లాకు అసిస్టెంట్ జిల్లా అధికారిగా బదిలీ చేయడమే కాకుండా ఇంచార్జి బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిగా మరియు ట్రైబల్ వెల్ఫేర్ ఇంచార్జ్ జిల్లా అధికారిగా నియమించడం జరిగిందన్నారు.అంతేకాకుండా డబ్బులు తీసుకుని దాదాపు ఆరుగురుకి అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు కల్పించాడని ఆరోపణలు ఉన్నాయన్నారు. హాస్టళ్లలో పనిచేసే ఐదుగురు ఉద్యోగులను తన స్వంత అవసరాలకు ఉపయోగించుకోవడమే గాక, ఒకరి బదులు మరొకరిని డ్యూటి చేయిస్తున్నాడన్నారు.విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే మెస్ బిల్లులో ప్రతి విద్యార్థి నుంచి ప్రతినెల 50 రూపాయలు ఇవ్వాలని హాస్టల్ వార్డెన్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తమ దృష్టికి వచ్చిందన్నారు.విద్యార్థుల కడుపు కొట్టే అధికారులను ఉపేక్షించేది లేదని,జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే అతనిని సస్పెండ్ చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి జిల్లా అధ్యక్షులు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, ఆర్టీఐ విభాగం అధ్యక్షులు గుర్రం రాఘవేందర్ కొత్తకోట మండల అధ్యక్షులు అంజన్న యాదవ్, ఆత్మకూర్ మండల ప్రధాన కార్యదర్శి అక్కల మల్లేష్ గౌడ్,దేవర శివ, చెలిమిల్ల రామన్ గౌడ్, కిరణ్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్వ్యూ కోసం సత్య నాదెళ్లకు మెయిల్..
### 4 నిమిషాల్లోనే రిప్లయ్

ప్రముఖ టెక్ సంస్థల్లో పనిచేసే వ్యక్తులు, వ్యాపార దిగ్గజాలు ఈ మధ్య తరచూ యూట్యూబ్ పాడ్‌కాస్ట్‌లో కనిపిస్తుండడం చూస్తునే ఉన్నాం. ఇక వీరిని షోకు రప్పించేందుకు యూట్యూబర్లు చాలానే శ్రమించాల్సి వస్తుంది. కానీ భారత సంతతికి చెందిన ఓ యూట్యూబర్ కేవలం నాలుగు నిమిషాల్లో టెక్ సంస్థ మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల ను ఇంటర్వ్యూకు ఒప్పించాడు. చిన్న ఇ-మెయిల్ సాయంతో ఇది సాధించాడు. అమెరికాలో నివాసం ఉంటున్న భారత సంతతికి చెందిన యూట్యూబర్ ద్వారకేశ్ పటేల్.. ప్రముఖులు, టెక్ సంస్థ వ్యవస్థాపకులతో పాడ్‌కాస్ట్‌లు నిర్వహిస్తుంటాడు. తన ఛానల్‌కు సంబంధించిన న్యూస్‌లెటర్ సబ్‌స్క్రైబర్ లిస్ట్‌లో ఉన్న నాదెళ్లను షోకు ఆహ్వానించేందుకు నేరుగా ఇ- మెయిల్ పంపాడు. " హాయ్ సత్య, నా న్యూస్‌లెటర్ సబ్‌స్క్రైబర్ లిస్ట్‌లో మీరు ఉండడం గమనించా. నా షోలో పాల్గొనేందుకు మీరు ఆసక్తిగా ఉన్నారా" అంటూ చిన్న ఇ- మెయిల్‌ను పంపాడు. మార్క్ జుకర్‌బర్గ్, టోనీ బ్లెయిర్, ఇలియా సుట్స్‌కేవర్ వంటి ప్రముఖులు ఇప్పటికే తన పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్నట్లు అందులో వివరించారు. ఇ-మెయిల్‌ని పంపిన నాలుగు నిమిషాల్లోనే సత్య నాదెళ్ల నుంచి సమాధానం రావడంతో యూట్యూబర్ ఆశ్చర్యపోయాడు. ద్వారకేశ్ తన ఆనందాన్ని 'ఎక్స్' వేదికగా పంచుకున్నాడు. ఇ-మెయిల్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లను నెటిజన్లతో షేర్ చేసుకున్నాడు. తాజాగా ఇంటర్వ్యూకు సంబంధించిన వీడియోను యూట్యూబ్, 'ఎక్స్' వేదికగా ఉంచాడు. పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న నాదెళ్ల మైక్రోసాఫ్ట్‌లో తన ప్రయాణం గురించి పంచుకున్నారు. గత 34 ఏళ్లుగా చాలా ఉత్సాహంగా కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అంశాల గురించి ఈ పాడ్‌కాస్ట్‌లో చర్చించారు. ఇదిలా ఉండగా.. ద్వారకేశ్ ఇ-మెయిల్‌కు నాదెళ్ల ప్రతిస్పందించడం నెటిజన్లను కట్టిపడేసింది. సత్య నాదెళ్ల నాయకత్వాన్ని ప్రశంసిస్తూ కామెంట్లు పెడుతున్నారు.



## ఉబర్ కీలక నిర్ణయం..
### ఆటో సేవలకు క్యాష్ పేమెంట్ మాత్రమే

క్యాబ్ అగ్రిగేటర్ సంస్థ ఉబర్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆటోలు బుక్ చేశాక ఇకపై క్యాష్ రూపంలో నేరుగా డ్రైవర్‌కే చెల్లింపులు చేయాలని పేర్కొంది. అంటే ఆటోరిక్షా డ్రైవర్‌కు, ప్రయాణికుడికి మధ్య జరిగే లావాదేవీల విషయంలో ఉబర్ ఏమాత్రం జోక్యం చేసుకోదు. 'సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్' విధానాన్ని అందిపుచ్చుకోవడంలో భాగంగా ఉబర్ ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త విధానాన్ని ఫిబ్రవరి 18 నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. ఆటో రిక్షాల నుంచి ఇకపై కమీషన్ కూడా వసూలు చేయబోమని ఉబర్ తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. ఉబర్‌లో ఇకపై మీరు ఆటో బుక్ చేసినప్పుడు మీకు సమీపంలోని డ్రైవర్లతో అనుసంధానం చేస్తుంది. బుక్ అయ్యాక చెల్లింపులు నేరుగా ఆటో డ్రైవర్‌కి నగదు లేదా యూపీఐ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఉబర్ క్రెడిట్స్, ఉబర్‌కు సంబంధించిర ఇతర ప్రమోషనల్ ఆఫర్లేవీ ఈ రైడ్లకు వర్తించవు. ట్రిప్‌కు సంబందించి డ్రైవర్ల నుంచి ఎలాంటి ఛార్జీ కూడా వసూలు చేయబోమని ఉబర్ తన బ్లాగ్ పోస్ట్‌లో పేర్కొంది. క్యాన్సిలేషన్లకు సంబంధించి ఎలాంటి ఛార్జీలూ విధించబోమని ఉబర్ తెలిపింది. అంతేకాదు రైడ్ బుకింగ్ సమయంలో ఉబర్ ఫేర్‌ను సూచిస్తుంది. అలాగని అదే ఫైనల్ మొత్తం కాదు. డ్రైవర్, ప్రయాణికులు పరస్పర అవగాహనతో తుది మొత్తాన్ని నిర్ణయించుకోవాలి. ఇకపై ఆటో డ్రైవర్లు పూర్తిగా స్వతంత్రంగా వ్యవహరిస్తారు. ఉబర్ కేవలం రైడర్లకు కనెక్ట్ చేసే ఓ ప్లాట్‌ఫామ్‌లా మాత్రమే వ్యవహరిస్తుంది. ఓలా, ర్యాపిడో ఇప్పటికే కమీషన్ ఆధారంగా కాకుండా సాఫ్ట్‌వేర్‌ను సర్వీసుగా అందించడం ప్రారంభించాయి. అంటే ట్రిప్‌కు కమీషన్ కాకుండా.. ప్లాట్‌ఫామ్ వాడుకోవడానికి డ్రైవర్లు కొంత మొత్తం చెల్లించాల్సి ఉంటుంది.



## బ్యాంక్ షేర్లలో అమ్మకాలు..
### వరుసగా మూడో రోజూ నష్టాలు

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా అదే ఒరవడి కొనసాగించాయి. దీంతో వరుసగా మూడో రోజూ నష్టాల్లో ముగిశాయి. అమెరికా అనుసరిస్తున్న టారిఫ్ పాలసీలు, దానివల్ల ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న భయాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. మన మార్కెట్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ, మారుతీ సుజుకీ షేర్లలో అమ్మకాలు సూచీలను కిందకు లాగాయి. స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు రాణించాయి. సెన్సెక్స్ ఉదయం 75,672.84 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,939.18) నష్టాల్లో ప్రారంభమయ్యాయి. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 75,463.01 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ చివరికి 203.22 పాయింట్ల నష్టంతో 75,735.96 వద్ద ముగిసింది. నిఫ్టీ 19.75 పాయింట్ల నష్టంతో 22,913.15 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.65గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఐటీసీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎన్టీపీసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, టాటా మోటార్స్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76.16 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2971 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# గూగుల్‌పేలో బిల్లు పేమెంట్స్‌పై ఫీజు

గూగుల్‌కు చెందిన పేమెంట్ యాప్ గూగుల్ పే విద్యుత్, గ్యాస్ వంటి బిల్ పేమెంట్లపైనా ఛార్జీలు వసూలు చేస్తోంది. ఇప్పటివరకు ఈతరహా లావాదేవీలపై ఎలాంటి ఫీజూ విధించేది కాదు. ఇకనుంచి క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా చేసే లావాదేవీలపై కన్వీనియన్స్ ఫీజు రూపంలో స్వల్ప మొత్తంలో రుసుము వసూలుచేసేందుకు సిద్ధమైంది. యూపీఐ లావాదేవీలకు మాత్రం ఈ ఛార్జీలు వర్తించవు. ఇతర పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లైన పేటీఎం, ఫోన్‌పే సంస్థలు ఇప్పటికే ఈతరహా ఫీజును వసూలుచేస్తుండగా.. ఇన్నాళ్లూ ఉచితంగా అందించిన గూగుల్ పే సైతం ఇకనుంచి వాటి బాటలోనే నడవనుంది. గూగుల్‌పే మొబైల్ రీఛార్జీలపై రూ.3 కన్వీనియన్స్ ఫీజు రూపంలో గతేడాది నుంచి వసూలుచేస్తోంది. ఇకపై క్రెడిట్, డెబిట్ కార్డు ద్వారా చేసే విద్యుత్, గ్యాస్ బిల్ పేమెంట్లపై 0.5 శాతం నుంచి 1 శాతం వరకు ఛార్జీలు విధిస్తున్నట్లు తెలుస్తోంది. గూగుల్‌పేలో ఇటీవల క్రెడిట్ కార్డ్ ద్వారా విద్యుత్ బిల్లు చెల్లించిన




ఓ యూజర్‌కు ఈ అనుభవం ఎదురైనట్లు ఓ ఆంగ్లమీడియా సంస్థ ఉదాహరణను ఉటంకించింది. తాను చెల్లించిన కరెంట్ బిల్‌పై రూ.15 కన్వీనియన్స్ ఫీజు రూపంలో గూగుల్ పే వసూలు చేసినట్లు ఆ వ్యక్తి పేర్కొన్నాడు. దీంతో ఈ పేమెంట్ ప్లాట్‌ఫామ్ ఇప్పటికే ఛార్జీల వసూలు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే ఈ రుసుములు అందరికీ వర్తిస్తాయా? లేదా? అనే విషయం ఇంకా తెలియరాలేదు. భవిష్యత్‌లో అందరినుంచీ ఈ ఫీజు వసూలు చేసే అవకాశం ఉందని టెక్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే దీనిపై గూగుల్ పే ఎక్కడా అధికారికంగా వివరాలు వెల్లడించలేదు. గూగుల్‌పే వెబ్‌సైట్ ప్రకారం.. కార్డ్ పేమెంట్ ప్రాసెసింగ్ ఖర్చుల్ని కవర్ చేసేందుకు ఈ రుసుము సాయపడుతుందని పేర్కొంది. ఇప్పటికే అనేక ఫిన్‌టెక్, క్విక్‌కామర్స్, ఫుడ్ డెలివరీ సంస్థలు ప్లాట్‌ఫామ్ ఫీజు వసూలుచేయడం ప్రారంభించాయి. ఇదే ట్రెండ్‌ను ఇతర సంస్థలూ అనుసరించే అవకాశం ఉందని, తమ ఆదాయాలు పెంచుకోవడానికి ఈ మొత్తాలు ఉపయోగపడతాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

## భారత్‌లోకి టెస్లా ఎంట్రీ.. వయా బెర్లిన్ రూట్

అమెరికాకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించడం దాదాపు ఖరారైంది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో కార్లు తయారుచేస్తున్న ఆ సంస్థ.. భారత్‌లో ప్లాంట్‌ను నెలకొల్పుతుందా? లేదా? అనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సిఉంది. తొలుత దిగుమతి చేసిన మోడళ్లను దేశీయంగా విక్రయించాలని ఆ కంపెనీ భావిస్తోంది. వీటిని పొరుగునున్న చైనా నుంచి కాకుండా జర్మనీ రాజధాని బెర్లిన్‌లోని తమ అతిపెద్ద గిగా ఫ్యాక్టరీ నుంచి దిగుమతి చేసే అవకాశం ఉంది. విద్యుత్ కార్ల దిగుమతికి సంబంధించి గతేడాది మార్చిలో భారత ప్రభుత్వం కొత్త ఈవీ పాలసీని తీసుకొచ్చింది. దీనికింద రూ.4,150 కోట్ల పెట్టుబడికి హామీ ఇచ్చి 15 శాతం సుంకంతో ఏటా 8 వేల వాహనాలను దిగుమతి చేసుకోవచ్చు. దేశీయంగా తయారీలో స్థానికంగా ముడిసరకు సమకూర్చుకోవాలన్న నిబంధన కూడా ఉంది. ఈ పాలసీని వినియోగించుకొని భారత్‌లోకి ఎంట్రీ ఇవ్వాలని టెస్లా భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. మరోవైపు నిన్న మొన్నటివరకు దేశీయంగా మస్క్ విద్యుత్ కార్ల తయారీ ప్లాంట్ నెలకొల్పకపోవచ్చన్న ఊహాగానాలు వినిపించాయి. కానీ, తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంపే స్వయంగా భారత్‌లో టెస్లా ప్లాంట్ ఏర్పాటు గురించి ప్రస్తావించడంతో అలాంటిదేమీ లేదని తేలింది. అమెరికాలో తయారైన కార్లకు లెఫ్ట్‌హ్యాండ్ డ్రైవింగ్ ఉంటుంది. మన దేశంలో రైట్ హ్యాండ్




డ్రైవింగ్ ఉంటుంది. పొరుగునున్న చైనాలో పెద్దఎత్తున రైట్ హ్యాండ్ డ్రైవింగ్ మోడళ్లను టెస్లా ఉత్పత్తి చేస్తోంది. అయితే, చైనాతో ఉన్న వివాదాల దృష్ట్యా డ్రాగన్ దేశం నుంచి దిగుమతుల విషయంలో టెస్లాకు భారత్ అభ్యంతరం తెలిపినట్లు తెలిసింది. దీంతో జర్మనీలోని బెర్లిన్ ఫ్యాక్టరీ నుంచి రైట్ హ్యాండ్ డ్రైవింగ్ కార్లను భారత్‌కు తీసుకురావాలని కంపెనీ భావిస్తోంది. ఇక్కడ టెస్లా వై మోడళ్లు తయారవుతున్నాయి. వీటినే భారత్‌కు తేనున్నారు. మరోవైపు ప్లాంట్ ఏర్పాటు విషయంలో గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు వంటి రాష్ట్రాలు ప్రధానంగా పోటీ పడుతున్నాయి. ఏపీ, తెలంగాణ కూడా ఈ రేసులో ఉన్నాయి.

## ఆ నిర్ణయం తీసుకున్నందుకు బాధ పడ్డా : బిల్ గేట్స్

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ తన కాలేజీ జీవితం గురించి పలు ఆసక్తికర విషయాలు వెల్లడించారు. హార్వర్డ్ యూనివర్సిటీలో చదువు మానేయాలనే నిర్ణయం తీసుకున్నప్పు డు చాలా బాధపడినట్లు తెలిపారు. 'సోర్స్ కోడ్ - మై బిగినింగ్స్' పేరిట తాను తీసుకొచ్చిన పుస్తకంలో పలు ఆసక్తికర విషయాల్ని తాజాగా పాల్గొన్న ఓ కార్యక్రమంలో పంచుకున్నారు. కళాశాల రోజులు చాలా ఆహ్లాదకరంగా గడిచాయని ఆనాటి రోజులను గుర్తుకుతెచ్చుకున్నారు. "హార్వర్డ్‌లో బాగా ఎంజాయ్ చేశాను. మనస్తత్వశాస్త్రం, ఆర్థిక శాస్త్రం, చరిత్రకు సంబంధించిన తరగతులను ఆస్వాదించే వాడిని. తెలివైన వాళ్లతో సమయం గడపడం నాకు నచ్చేది. ఆసక్తికరమైన విషయాలపై రాత్రిళ్లూ చర్చించేవాళ్లం" అని గేట్స్ అన్నారు. 1975లో సాఫ్ట్‌వేర్ కంపెనీ తొలి సీఈవోగా బాధ్యతలు చేపట్టేందుకు హార్వర్డ్ యూనివర్సిటీలో చదువు మానేయాల్సి వచ్చిందని బిల్‌గేట్స్ వెల్లడించారు. ఆ నిర్ణయం తీసుకోవడం చాలా బాధను కలిగించిందన్నారు. డిగ్రీ పూర్తి చేసేందుకు హార్వర్డ్‌కు తిరిగి వెళ్లాలనిపించిందన్నారు. అయితే వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొనేందుకు తాను, తన స్నేహితుడు అయిన పాల్‌అలెన్‌ను, కళాశాలను



విడిచిపెట్టాల్సి వచ్చిందని గేట్స్ తెలిపారు. ఆ సమయంలో గేట్స్, అలెన్ ఇద్దరూ కంప్యూటర్ల కోసం ఒక సాఫ్ట్‌వేర్‌ను సృష్టించగలిగితే కొత్త పరిశ్రమలో ముందంజలో ఉండగలమని భావించారు. అలా రెండేళ్లు మైక్రోసాఫ్ట్‌ను నడుపుతూనే తన చదువును బ్యాలెన్స్ చేసేందుకు ప్రయత్నించారు. తన చదువు పూర్తి చేసేందుకు మరో స్నేహితుడు, మైక్రోసాఫ్ట్ ప్రోగ్రామర్ అయిన రిక్ వీలాండ్ సాయం తీసుకోవాలనుకున్నారు. కానీ అది కుదరలేదు. ఇక చివరకు చదువు మానేయాల్సి వచ్చిందని తెలిపారు. ఇదిలాఉంటే.. 'సోర్స్ కోడ్' పుస్తకాన్ని మూడు భాగాలుగా తీసుకొస్తున్నారు. వాల్యూమ్-1లో తన చిన్ననాటి సంగతులు, డ్రగ్స్‌తో ప్రయోగం లాంటి వివరాలను మాత్రమే గేట్స్ ప్రస్తావించారు. తన ఉద్యోగ జీవితం, మైక్రోసాఫ్ట్‌లో ప్రయాణం, మెలిందా గేట్స్‌తో వివాహం, దాతృత్వ కార్యక్రమా లకు దీనిలో చోటు కల్పించలేదు. భవిష్యత్‌లో విడుదల చేసే పుస్తకాల్లో వాటి గురించి వివరించే అవకాశముంది. 2000 సంవత్సరం వరకు మైక్రోసాఫ్ట్ సీఈఓగా గేట్స్ విధులు నిర్వర్తించారు. తన పదవీకాలంలో కంప్యూటర్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పుల్ని తీసుకొచ్చారు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరిగా నిలిచారు.

## అమెరికా ప్రతీకార సుంకాల ప్రభావం భారత్‌పై తక్కువే

అమెరికా ప్రతీకార సుంకాల (రెసీప్రోకల్ టారిఫ్) ప్రభావం భారత్‌పై పరిమితంగానే ఉంటుందని అమెరికా క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేస్తోంది. ప్రధానంగా దేశీయ గిరాకీపైనే భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఆధారపడి ఉండటమే ఇందుకు కారణమని పేర్కొంది. అమెరికాకు గణనీయ స్థాయిలో సేవలను భారత్ ఎగుమతి చేస్తోందని, వీటి జోలికి ట్రంప్ ప్రభుత్వం వెళ్లకపోవడం సానుకూలాంశమని వెల్లడించింది. తమ ఉత్పత్తులపై ఏ దేశం ఎంత టారిఫ్ విధిస్తే, తమ దేశంలోకి వచ్చే ఆ తరహా ఉత్పత్తులపై అంతే సుంకం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటిస్తున్న సంగతి విదితమే. అమెరికాతో వాణిజ్య మిగులు అధికంగా కలిగి ఉన్న వియత్నాం, దక్షిణ కొరియా, తైవాన్ లాంటి దేశాలపై ప్రతీకార సుంకాల ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ ఆర్థికవేత్త (ఆసియా పసిఫిక్) విస్తృత్ రాణా తెలిపారు. భారత్ మాదిరే జపాన్ కూడా స్థానిక గిరాకీ, సేవల ఎగుమతులపై ఎక్కువగా ఆధారపడి ఉండటం వల్ల ఈ రెండు దేశాలపై ప్రతీకార సుంకాల ప్రభావం పరిమితంగా ఉంటుందని పేర్కొన్నారు. 'ఆర్థిక వ్యవస్థ వృద్ధి కోసం వస్తువుల ఎగుమతులపై మరీ ఎక్కువగా భారత్ ఆధారపడి లేదు. అందువల్ల అమెరికా టారిఫ్‌ల ప్రభావం తక్కువగానే ఉండొచ్చ'ని రాణా అభిప్రాయపడ్డారు.

ఈ రంగాలకు ముప్పు..: భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తువులకు సంబంధించి ఆభరణాలు, ఔషధాలు, వస్త్రాలు, రసాయనాల రంగాలపై అమెరికా ప్రతీకార సుంకాలను విధించాల్సి ఉంటుంది. అయితే ఔషధాలపై టారిఫ్‌ను అమెరికా పెంచకపోవచ్చని ఎస్ అండ్ పీ గ్లోబర్



రేటింగ్స్ డైరెక్టర్ (ఆసియా- పసిఫిక్) ఈఫార్న్ ఫ్యూయా తెలిపారు. 'సాధారణంగా భారత్ నుంచి జనరిక్ ఔషధాలే అమెరికాకు ఎగుమతి అవుతుంటాయి. వీటిపై టారిఫ్ పెంచితే అమెరికాలోనే ఆరోగ్య సంరక్షణ వ్యయాలు పెరుగుతాయ'ని ఫ్యూయా వివరించారు. వస్త్రాలు, కొంత మేర రసాయనాలపై టారిఫ్ పెంపు అవకాశాలున్నాయని వివరించారు. రాబోయే రెండేళ్లలో భారత జీడీపీ వృద్ధి 6.7-6.8 శాతంగా నమోదవ్వొచ్చని ఫ్యూయా అంచనా వేశారు. ఇతర వర్ధమాన దేశాలతో పోలిస్తే ఇది అధికమేనని తెలిపారు. ఆదాయపు పన్ను కోత ప్రభావంతో దేశీయంగా గిరాకీ పెరగడం, భారత ఆర్థిక వ్యవస్థకు కలిసి వస్తుందని.. ప్రస్తుతం భారత జీడీపీ వృద్ధి మరింత 'స్థిరత్వ స్థానానికి' వస్తోందని వివరించారు. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాలకు నిర్దేశించుకున్న ద్రవ్యలోటు లక్ష్యాలను (4.8%బీ 4.4%) భారత్ సాధిస్తుందనీ ఎస్అండ్‌పీ ఆశాభావం వ్యక్తం చేసింది.

## పాలసీ జారీ చేశాకే ప్రీమియం వసూలు
### బీమా సంస్థలకు ఐఆర్‌డీఏఐ ఆదేశం
### మార్చి 1 నుంచి అమల్లోకి

జీవిత, ఆరోగ్య బీమా పాలసీలు జారీ చేశాకే పాలసీదారుల ఖాతా నుంచి బీమా ప్రీమియాన్ని వసూలు (డెబిట్) చేయాలని భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) బీమా సంస్థలను ఆదేశించింది. ప్రీమియం చెల్లించేందుకు పాలసీదారులు తమ బ్యాంకు ఖాతాల్లో నిర్ణీత మొత్తాన్ని నిలిపివేసుకునే (బీమా-అస్బా) సౌకర్యాన్ని అందించాలని సూచించింది. ఫలితంగా పాలసీ జారీ చేశాక మాత్రమే, ప్రీమియం మొత్తం మన ఖాతాలో నుంచి వెళ్తుందన్నమాట. దీనికోసం యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)లో ఓటీఎం (వన్ టైం మాండేట్)ను ఉపయోగించి, బీమా-అస్బా (బీమా అప్లికేషన్ సపోర్టెడ్ బై బ్లాక్డ్ అమౌంట్) వెసులుబాటుతో వినియోగదారుల ఖాతాలో డబ్బును ప్రీమియం మొత్తం మేరకు నిలిపివేసేందుకు వీలవుతుంది. బీమా ప్రతిపాదనను అంగీకరిస్తున్నట్లు బీమా సంస్థ పాలసీదారుడికి తెలిపాకే, ఆ ప్రీమియం ఖాతాలో నుంచి బదిలీ అవుతుంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) నిర్దేశించిన పరిమితి మేరకు, బీమా సంస్థలు ఈ వెసులుబాటును వినియోగించుకోవచ్చని నియంత్రణ సంస్థ వెల్లడించింది. జీవిత, ఆరోగ్య బీమా పాలసీల కోసం బీమా సంస్థలు తప్పనిసరిగా బీమా-అస్బా సౌకర్యాన్ని అందించాలని పేర్కొంది. వచ్చే నెల 1 నుంచి ఈ వెసులుబాటును ప్రారంభించాలని సూచించింది. బీమా సంస్థలు పలు బ్యాంకులతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవాలని తెలిపింది. ప్రస్తుతానికి ఈ సౌకర్యం వ్యక్తిగత పాలసీదారులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. స్టాక్ మార్కెట్లో ఐపీఓలకు దరఖాస్తు చేసే రిటైల్ మదుపరులకు అస్బా సౌకర్యం సుపరిచితమే.




## ఎస్‌బీఐ బాటలోనే పీఎన్‌బీ..
### రుణాలపై వడ్డీ రేట్లు తగ్గింపు

దాదాపు ఐదేళ్ల తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల రెపో రేటును తగ్గించింది. దానికి అనుగుణంగా ఇప్పుడు బ్యాంకులు కూడా రుణ రేట్లను సవరిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీరేట్లను తగ్గించగా.. ఇప్పుడు మరో ప్రభుత్వ బ్యాంకు పీఎన్‌బీ కూడా అదే నిర్ణయం తీసుకుంది. రిటైల్ రుణాలపై 25 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు పంజాబ్ నేషనల్ బ్యాంక్ గురువారం ప్రకటించింది. కొత్త వడ్డీ రేట్లు ఫిబ్రవరి 10 నుంచే అమల్లోకి తీసుకొచ్చినట్లు బ్యాంకు తాజా ప్రకటనలో వెల్లడించింది. గృహ రుణాలతో పాటు, కారు, ఎడ్యుకేషన్, పర్సనల్ లోన్లపై ఈ తగ్గింపు వర్తించనుంది. తాజా సవరణతో పీఎన్‌బీలో గృహ రుణాల ప్రారంభ రేటు 8.15శాతానికి దిగొచ్చింది. దీంతో రూ.లక్ష రుణానికి ఈఎంఐ రూ.744గా ఉంటుందని బ్యాంకు తెలిపింది. ఇక, ఆటోమొబైల్ రుణాలపై వడ్డీ రేటు 8.50 శాతం నుంచి ప్రారంభం కానుంది. విద్యా రుణాలపై కనిష్ఠ వడ్డీని 7.85 శాతానికి తగ్గించినట్లు పీఎన్‌బీ తెలిపింది. అటు వ్యక్తిగత రుణాలపై సవరించిన వడ్డీ రేటు 11.25శాతంగా ఉన్నట్లు పేర్కొంది. ఫిబ్రవరి 7న రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 6.50 శాతం నుంచి 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతానికి తగ్గించిన సంగతి తెలిసిందే. దీంతో పలు బ్యాంకులు కూడా తమ రుణాలపై వడ్డీ రేట్లను సవరిస్తున్నాయి. గతవారం ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ ఆధారిత లెండింగ్ రేట్, రెపో లింక్డ్ లెండింగ్ రేట్లను ఎస్‌బీఐ 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది.




## గ్రిన్‌టెక్‌ను కొనుగోలు చేసిన యూమా ఎనర్జీ

యూమా ఎనర్జీ..తన బ్యాటరీ-యాజ్-సర్వీస్ ఎకోసిస్టమ్‌ను మెరుగుపరచడానికి చెన్నైకి చెందిన శక్తి నిల్వ పరిష్కార స్టార్టప్ 'గ్రిన్‌టెక్ మోటార్స్ అండ్ సర్వీసెస్'ను కొనుగోలు చేసినట్లు గురువారం ప్రకటించింది. ఈ వ్యూహాత్మక కొనుగోలు గ్రిన్‌టెక్‌కు సంబంధించిన బ్యాటరీ సాంకేతిక నైపుణ్యాన్ని ఏకీకృతం చేయడానికి యూమా ఎనర్జీకి వీలు కల్పిస్తుంది. యూమా ఎనర్జీ..దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రిక్ మొబిలిటీ మార్కెట్‌లో మంచి స్థానంలో ఉంది. బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, అధునాతన, తయారీలో మా అంతర్గత నైపుణ్యాన్ని పెంపొందించే దిశగా ఈ కొనుగోలు వ్యూహాత్మక అడుగు అని యూమా ఎనర్జీ ఎండీ, ముత్తు సుబ్రమణియన్ అన్నారు. యూమా గత నెలలో భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో గ్రిన్‌టెక్‌తో కలిసి అభివృద్ధి చేసిన అధునాతన బ్యాటరీని ఆవిష్కరించింది.





# బంగ్లాపై భారత్ ఘన విజయం

## శుభ్‌మన్ గిల్ సెంచరీ.. ఐదు వికెట్లతో చెలరేగిన షమీ

**దుబాయ్ :** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ శుభారంభం చేసింది. దుబాయ్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లా 49.4 ఓవర్లలో 228 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో భారత్ 46.3 ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయి 231 పరుగులు చేసి విజయం సాధించింది. భారత ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (101లి) సెంచరీ బాదాడు. కెరీర్‌లో ఇది 8వ శతకం కాగా.. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో తొలి సెంచరీ కావడం విశేషం.

### రోహిత్ దూకుడు..

ఇంగ్లండ్‌పై సెంచరీ సాధించి దూకుడు మీదున్న కెప్టెన్ రోహిత్ శర్మ (41) అదే ఆటతీరును ఇక్కడా ప్రదర్శించాడు. తొలి వికెట్‌కు మరో ఓపెనర్ గిల్‌తో కలిసి 10 ఓవర్లలోపే 69 పరుగులు జోడించాడు. రోహిత్ ఔటైన తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన విరాట్ (22) కాస్త ఆచితూచి ఆడాడు. షాట్లు కొట్టకుండా సింగిల్స్‌కు పరిమితమయ్యాడు. స్పిన్నర్ రిషద్ బౌలింగ్‌లోనే కోహ్లి వికెట్ ఇచ్చేశాడు. శ్రేయస్ అయ్యర్ (15) కాసేపు చూడచక్కని ఆటతీరు ప్రదర్శించాడు. అయితే, ఎక్కువ సమయం క్రీజ్‌లో ఉండలేదు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో ఐదో స్థానంలో ఆకట్టుకున్న అక్షర్ పటేల్ (8) ఈసారి తేలిపోయాడు. మరోవైపు వికెట్లు పడుతున్నా సరే ఏకాగ్రతను కోల్పోకుండా శుభ్‌మన్ గిల్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కేఎల్ రాహుల్ (40)తో కలిసి జట్టును గెలిపించాడు. ఈ క్రమంలో కేఎల్‌కు అదృష్టం కూడా కలిసొచ్చింది. చేతిలో పడిన క్యాచ్‌ను బంగ్లా ఫీల్డర్ చేజార్చాడు. స్పిన్నర్లు ప్రభావం చూపించడంతో భారత బ్యాటర్లు ఆచితూచి ఆడి పరుగులు రాబట్టారు. కేఎల్ – గిల్ ఐదో వికెట్‌కు 87 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.

### ఆ క్యాచ్ మిస్ చేయకపోతే..

బంగ్లాదేశ్ 35/5 స్కోరుతో ఉన్నప్పుడు అక్షర్ పటేల్ బౌలింగ్‌లో జకేర్ అలీ (68) ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో కెప్టెన్ రోహిత్ వదిలేశాడు. అక్షర్ పటేల్ హ్యాట్రిక్ కూడా మిస్ అయిపోయింది. అక్కడ్నుంచే బంగ్లా ఇన్నింగ్స్ ముందుకు సాగింది. జకేర్‌తో కలిసి సెంచరీ హీరో తౌహిద్ హృదోయ్ (100) ఇన్నింగ్స్‌ను నడిపించాడు. వీరిద్దరూ ఆరో వికెట్‌కు 154 పరుగులు జోడించారు. జకేర్ ఔటైనా సరే తౌహిద్ మాత్రం చివరి వికెట్‌గా వెనుదిరిగి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. ఒకవేళ జకేర్ ఇచ్చిన క్యాచ్‌ను అందుకొని ఉంటే భారత్ ఎదుట ఆమాత్రం లక్ష్యం కూడా ఉండేది కాదు. టీమ్‌ఇండియా కూడా ఇంత కష్టపడాల్సిన అవసరం లేకుండా పోయేది. అయితే, భారత సీనియర్ పేసర్ షమీ (5/53) మరోసారి ఐసీసీ టోర్నీలో సత్తా చాటాడు. ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. అతడితోపాటు హర్షిత్ 3, అక్షర్ పటేల్ 2 వికెట్లు తీశారు.

## షమీ ఖాతాలో ప్రపంచ రికార్డు




ఐసీసీ ట్రోఫీలంటే చాలు చెలరేగిపోయే భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. బంగ్లాదేశ్ పై ఐదు వికెట్ల ప్రదర్శన చేసిన షమీ.. ప్రపంచ రికార్డును సాధించాడు. అత్యంత వేగంగా 200 వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచాడు. అయితే, ఇదంతా బంతులపరంగానే. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఆసీస్ స్టార్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఉన్నాడు. స్టార్క్ 5,240 బంతుల్లో 200 మార్క్‌ను అందుకోగా.. షమీ 5,126 బంతుల్లోనే 200 వికెట్లు తీయడం విశేషం. ఇక మ్యాచులపరంగా స్టార్క్ (102 వన్డేల్లో) ముందుండగా.. షమీ (104) రెండో స్థానంలో ఉన్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ తరఫున రెండో అత్యుత్తమ గణాంకాలను నమోదు చేసిన బౌలర్‌గా షమీ నిలిచాడు. బంగ్లాపై 5/53 గణాంకాలను నమోదు చేశాడు. అతడికంటే ముందు రవీంద్ర జడేజా (2013లో) విండీస్‌పై 5/36 గణాంకాలను సాధించాడు. వరల్డ్ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ ఈవెంట్లలో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గానూ షమీ నిలిచాడు. ఇప్పటి వరకు 60 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. జహీర్ ఖాన్ (59), జవగళ్ శ్రీనాథ్ (47), రవీంద్ర జడేజా (43) తర్వాత స్థానాల్లో ఉన్నారు.

## రోహిత్ క్యాచ్ మిస్.. అక్షర్ హ్యాట్రిక్ మిస్

భారత కెప్టెన్ రోహిత్ శర్మ మైదానంలోనే తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఇదేదో సహచర క్రికెటర్ మీద అనుకుంటే పొరపాటే. తాను చేసిన పొరపాటుకు పశ్చాత్తాపపడ్డాడు. అక్షర్ పటేల్ బౌలింగ్‌లో తన చేతిలో పడిన క్యాచ్ నేలపాలైంది. దీంతో గ్రౌండ్‌ను బాదేస్తూ.. తన అసంతృప్తిని రోహిత్ వెల్లడించాడు. అదే సమయంలో బౌలర్ అక్షర్‌కు సారీ కూడా చెప్పేశాడు. ఇదేదో సాధారణ క్యాచ్ అయి ఉంటే ఎవరూ పెద్దగా పట్టించుకొనేవారు కాదు. కానీ, ఛాంపియన్స్ ట్రోఫీలో హ్యాట్రిక్ సాధించే సువర్ణావకాశం కోల్పోయేలా చేసిన క్యాచ్. అసలింతకీ ఏం జరిగిందంటే? ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా తొలి మ్యాచ్‌ను టీమ్‌ఇండియా బంగ్లాదేశ్‌తో ఆడుతోంది. బంగ్లా ఇన్నింగ్స్‌లో 9వ ఓవర్‌ను భారత స్పిన్నర్ అక్షర్ పటేల్ వేశాడు. రెండో బంతికే ఓపెనర్ తంజిద్ (25)ను ఔట్ చేశాడు. ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన సీనియర్ బ్యాటర్ ముష్ఫికర్ (0)ను కూడా పెవిలియన్‌కు చేర్చాడు. ఈ రెండు క్యాచ్‌లను వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ పట్టాడు. ఇద్దరు బ్యాటర్లు ఔటైనాక బ్యాటింగ్‌కు దిగిన జకేర్ అలీ కూడా స్లిప్‌లో దొరికిపోయేవాడే. అక్కడే కాచుకున్న ఉన్న రోహిత్ శర్మ బంతిని అందుకొన్నట్లే కనిపించాడు. కానీ, చివరి క్షణంలో బంతి చేతి నుంచి జారిపోయింది. దీంతో అక్షర్ పటేల్ హ్యాట్రిక్ కూడా మిస్ అయిపోయింది. దీనికి సంజాయిషీగా అక్షర్‌కు రోహిత్ క్షమాపణలు చెబుతూ సైగలు చేశాడు.

## అప్పటికే సంబరాలు చేసుకోవడం మొదలుపెట్టా : అక్షర్ పటేల్



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో హ్యాట్రిక్ తీయడమంటే చాలా స్పెషల్. అలాంటి అవకాశం కాస్త చేజారితే ఆ బాధ వర్ణనాతీతం. అదీనూ సులువైన క్యాచ్‌ను వదిలేస్తే... సరిగ్గా బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లోనూ అదే జరిగింది. స్లిప్‌లో సులువైన క్యాచ్‌ను కెప్టెన్ రోహిత్ శర్మ వదిలేశాడు. మరి, అటువైపు బౌలింగ్‌లో ఉన్నది అక్షర్ పటేల్. మరి అతడి రియాక్షన్ ఏంటనేది బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ముగిశాక వెల్లడించాడు. అప్పటికే తాను సంబరాలు చేసుకోవడం ప్రారంభించినట్లు తెలిపాడు. "నిజాయితీగా చెప్పాలంటే నేను అప్పటికే సంబరాలు చేసుకోవడం మొదలెట్టా. బంతి రోహిత్ వద్దకు వెళ్లినప్పుడు కచ్చితంగా క్యాచ్‌గా మారిపోతుందని భావించా. అయితే, కెప్టెన్ క్యాచ్‌ను వదిలేసినట్లు తర్వాత గుర్తించా. ఇంకేం చేస్తాం. అయితే, క్రికెట్‌లో ఇలాంటివన్నీ సహజమే. అందుకే, నేను పెద్దగా ప్రతిస్పందించలేదు. వెంటనే వెనక్కి వెళ్లిపోయి బంతిని వేసేందుకు సిద్ధమయ్యా. అసలు తొలి వికెట్ నాకు రావడమే నమ్మలేకపోయా. తంజిద్ ఔటైనట్లు తొలుత నేను భావించలేదు. కానీ, వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ మాత్రం నమ్మకంగా ఉన్నాడు. అతడే ఎక్కువగా అప్పీలు చేశాడు. ఆ తర్వాత అద్భుత బంతితో రెండో వికెట్ దక్కింది. హ్యాట్రిక్ కోసం ప్రయత్నించా. కొత్త బ్యాటర్ బ్యాట్‌ను బంతి తాకుతూ స్లిప్‌లోకి వెళ్లింది. హ్యాట్రిక్ కొట్టేశానని భావించా. సెలబ్రేషన్స్ స్టార్ట్ చేస్తూ అప్పుడు రోహిత్ వైపు చూశా" అని అక్షర్ పటేల్ వివరించాడు. ఈ మ్యాచ్‌లో అక్షర్ పటేల్ 9 ఓవర్లలో 43 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు తీశాడు.

## 11వేల క్లబ్‌లోకి రోహిత్

వన్డేల్లో భారత సారథి రోహిత్ శర్మ 11వేల క్లబ్‌లోకి చేరాడు. బంగ్లాదేశ్‌పై 41 పరుగులు చేసి పెవిలియన్‌కు చేరాడు. అయితే, 12 పరుగులు చేసినప్పుడే భారత్ తరఫున వన్డేల్లో 11వేలకుపైగా రన్స్ చేసిన నాలుగో బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 261 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనతను సాధించాడు. అతడి కంటే ముందు విరాట్ కోహ్లి (222) మాత్రమే ఉన్నాడు. సచిన్ (276), గంగూలీ (288) కంటే రోహిత్ ముందున్నాడు.



# ఇదేం క్రికెట్ పాక్..

### భారత్‌తో ఇలా ఆడితే కష్టమే : అక్తర్

ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ పూర్తిగా నిరాశపర్చిందని ఆ దేశ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ మండిపడ్డాడు. ప్రపంచమంతా ఒకలాంటి క్రికెట్ ఆడుతుంటే.. పాక్ పూర్తిగా విభిన్నమైన ఆటతీరును ప్రదర్శించిందని ఎద్దేవా చేశాడు. అసలు జట్టు ఎంపికే ఘోరంగా ఉందని అభిప్రాయపడ్డాడు. ఒక్క ఇంపాక్ట్ ప్లేయర్ కూడా లేడని విమర్శించాడు. "మీరంతా మ్యాచ్‌ను చూశారుగా.. నాలానే నిరాశ చెందుంటారు. మిగిలిన ప్రపంచంతో పోలిస్తే.. పాక్ పూర్తిగా భిన్నమైన క్రికెట్‌ను ఆడింది. జట్టులో ఒక్క ఇంపాక్ట్ ప్లేయర్ కూడా దీనిలో లేరు. స్ట్రైక్ రేట్ చాలా నిదానంగా ఉంది. బంతికో పరుగుకూడా చేయలేకపోయారు. అంతేకాదు.. చాలా ఉదారంగా పరుగులు ఇచ్చాం. మిగిలిన జట్లలో ఆరు లేదా ఏడుగురు బౌలర్లుంటే.. పాక్‌లో మాత్రం నలుగురే ఉన్నారు. ఈ ఆరంభం నిరాశపర్చింది" అని అక్తర్ పేర్కొన్నాడు.



### ఇలా అయితే భారత్‌తో కష్టమే..

"పాకిస్థాన్ ఇప్పుడు భారత్ ఎదుట చావో రేవో అన్న పరిస్థితిలోకి జారుకొంది. ఆ జట్టు చాలా బలంగా.. దుర్భేద్యంగా ఉంది. పాక్‌కు నేను బెస్టాఫ్ లక్ చెబుతున్నాను. భారత్ దూకుడుగా ఆడి ఈ మ్యాచ్‌ను గెలిచేందుకు యత్నిస్తుంది. మీరు కూడా దూకుడుగా ఆడటం మినహా మరో ఆప్షన్ లేదు. ఇప్పటిలాగా మాత్రం కాదు. పరిస్థితి చాలా కష్టంగా కనిపిస్తోంది" అని అక్తర్ వ్యాఖ్యానించాడు.

### పాక్‌కు కోలుకోలేని దెబ్బ..

పాక్ స్టార్ ఓపెనర్ ఫకర్ జమాన్ గాయం కారణంగా ఏకంగా టోర్నీ నుంచే బయటకు వెళ్లిపోయాడు. అతడి స్థానంలో ఇమామ్ ఉల్ హక్‌ను జట్టులోకి తీసుకొన్నారు. నిన్న మ్యాచ్‌లో రెండో బంతికి విల్ యంగ్ ఆడిన కవర్ డ్రైవ్‌ను అడ్డుకొనే క్రమంలో అతడు గాయపడ్డాడు. ఆ తర్వాత దాదాపు రెండు గంటలపాటు అతడు మైదానంలోకి రాలేదు. జట్టు డాక్టర్, ఫిజియో అతడి వెంటే ఉన్నారు.

ఓపెనింగ్‌కు బదులు నాలుగో స్థానంలో బ్యాటింగ్ వచ్చినా.. ఇబ్బందిపడుతూ ఆడి 41 బంతుల్లో 24 పరుగులు చేశాడు. వికెట్ల మధ్య పరుగులు తీయడానికి కూడా అవస్థపడ్డాడు. 2017 ఛాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఓవల్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్‌పై అతడు 114 పరుగులు సాధించాడు. దీంతో పాక్ విజయం సాధించింది.

# 'బాస్ మజాక్ చేస్తుండు'..

## కివీస్ టైటిల్ కొట్టేస్తుందన్న టేలర్ వ్యాఖ్యలపై ధావన్

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్‌పై న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన పాక్‌కు షాక్ ఇస్తూ కివీస్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ క్రమంలో తమ జట్టు ఈసారి ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలుస్తుంది కదా? అనే కివీస్ మాజీ ఆటగాడు రాస్ టేలర్ ఆశలకు భారత మాజీ క్రికెటర్ శిఖర్ ధావన్ బ్రేకులేశాడు. తన దృష్టిలో న్యూజిలాండ్ ఇప్పటికీ ఫేవరెట్ కాదని ధావన్ పేర్కొన్నాడు. ఈసారి గెలుస్తుందంటూ టేలర్ అన్న మాటలకు గబ్బర్ తక్కున నవ్వేశాడు. ఆ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. 'బాస్ ఏదో తమాషా చేస్తున్నాడు' అంటూ క్యాప్షన్ ఇవ్వడం గమనార్హం. ఇప్పుడీ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. గ్రూప్ స్టేజ్‌లో కివీస్ ఇంకా భారత్, బంగ్లాదేశ్‌తో తలపడాల్సి ఉంది. ఇందులో ఒక్క మ్యాచ్ గెలిచినా సెమీస్‌కు దూసుకెళ్లడం న్యూజిలాండ్‌కు తేలికవుతుంది. ప్రస్తుతం జట్లలో కివీస్ కూడా చాలా బలంగానే ఉంది. దృఢమైన బ్యాటింగ్ ఆర్డర్ ఆ జట్టుకు కలిసొచ్చే అంశమవుతుందని క్రికెట్ పండితులు అంచనా వేస్తున్నారు. పాకిస్థాన్‌లోని పరిస్థితులపై కివీస్ ప్లేయర్లకు పూర్తి అవగాహన ఉండటమూ దీని కారణంగా విశ్లేషించారు. అయితే, ధావన్ మాత్రం విభిన్నంగా స్పందించడం గమనార్హం.



## ఎన్టీఆర్ - నీల్ ప్రాజెక్ట్.. సమరం మొదలైంది




ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. గతేడాదిలో ఈ సినిమా పూజా కార్యక్రమం జరిగినప్పటికీ చిత్రీకరణ మాత్రం జరగలేదు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ సినిమా రెగ్యులర్ షూట్ మొదలైనట్లు చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. "భారతీయ సినిమా చరిత్రలో ఒక మార్క్‌ని క్రియేట్ చేసేలా ఈ మట్టి ఎట్టకేలకు తన పాలనను స్వాగతించింది. ఎన్టీఆర్ – నీల్ సినిమా అధికారికంగా మొదలైంది. ప్రేక్షకులను అలరించేందుకు సరికొత్త యాక్షన్, వినోదం సిద్ధమవుతోంది" అని టీమ్ పేర్కొంది. చిత్రీకరణకు సంబంధించిన ఫొటోని సైతం పంచుకుంది. ఇందులో నీల్ యాక్షన్ సన్నివేశాన్ని డైరెక్ట్ చేస్తూ కనిపించారు. ఎన్టీఆర్ ఇంకా ఈ చిత్రీకరణలో భాగం కాలేదని సమాచారం. త్వరలోనే ఆయన సెట్‌లోకి అడుగుపెడతారని టాక్. ఎన్టీఆర్ 31వ ప్రాజెక్ట్‌గా ఇది సిద్ధమవుతోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. పీరియాడిక్ మాస్ యాక్షన్ డ్రామాగా ఇది రానుంది. ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ సందడి చేయనున్నట్లు తెలుస్తోంది. మలయాళ యువ హీరో టొవినో థామస్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీనికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

## ఆ స్టార్‌కపుల్ విడాకులు.. నన్ను తిడుతూ మెసేజ్‌లు పంపారు

### దివ్యభారతి



'కింగ్‌స్టన్'తో ప్రేక్షకులకు వినోదాన్ని పంచేందుకు సిద్ధమయ్యారు నటుడు జీవీ ప్రకాశ్, నటి దివ్య భారతి. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో వీరిద్దరూ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ముఖ్యంగా జీవీ ప్రకాశ్ విడాకులను ఉద్దేశించి దివ్యభారతి కీలక విషయాలు వెల్లడించారు. జీవీ ప్రకాశ్ – సైంధవి దంపతులు విడాకులు ప్రకటించిన సమయంలో తనని ఎంతో విమర్శించారని అన్నారు. వారు విడిపోవడానికి కారణం తానేనని జోరుగా ప్రచారం సాగిందని తెలిపారు. "జీవీ, నేను గతంలో 'బ్యాచిలర్' కోసం కలిసి వర్క్ చేశాం. ఆ సినిమాలో మా జంట కెమిస్ట్రీకి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది. ఆ సినిమా చూసి మేమిద్దరం రిలేషన్‌లో ఉన్నామని ఎంతోమంది తప్పుగా అనుకున్నారు. ఈ క్రమంలోనే గతేడాది జీవీ ప్రకాశ్ – సైంధవి విడాకులు ప్రకటించిన సమయంలో ఎంతోమంది నాకు సందేశాలు పంపారు. వారు విడిపోవడానికి కారణం నేనేనన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. విడాకుల తర్వాత వారిద్దరూ కలిసి ఒక కాన్సర్ట్ నిర్వహించారు. ఆ విషయం తెలిసి నేను ఎంతో సంతోషించా. ఇకపై నాకు ఇలాంటి సందేశాలు రావనుకున్నా. కానీ పరిస్థితి తారుమారైంది. నాపై విమర్శలు మరింత పెరిగాయి. నన్ను తిడుతూ మెసేజ్‌లు పెట్టేవారిలో ఎక్కువమంది మహిళలే ఉండేవారు. ఆ సందేశాలను జీవీకి పంపేదాన్ని. 'ఇలాంటి సందేశాల గురించి ఆలోచించడం మానేసి కెరీర్‌పై దృష్టి పెట్టు' అని ఆయన రిప్లై ఇచ్చేవారు" అని దివ్య భారతి తెలిపారు. ఇదే విషయంపై జీవీ ప్రకాశ్ సైతం మాట్లాడారు. "దివ్యతో నేను పలు ప్రాజెక్ట్‌ల కోసం కలిసి వర్క్ చేశాను. మా మధ్య మంచి స్నేహబంధం ఉంది. అంతకుమించి మరే సంబంధం లేదు. కెరీర్ విషయంలో సైంధవి, నేను ఎంతో క్రమశిక్షణతో ఉంటాం. విడాకులు ప్రకటించిన తర్వాత కూడా మేమిద్దరం కలిసి కాన్సర్ట్ ఇవ్వాలని నిర్ణయించుకొని అందుకోసం వర్క్ చేశాం. ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికే నేను ఇక్కడికి వచ్చాను. నా వర్క్‌తో వాళ్లకు వినోదాన్ని అందిస్తూనే ఉంటా" అని తెలిపారు. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ మేనల్లుడిగా కెరీర్ ఆరంభించారు జీవీ ప్రకాశ్. తమిళంలో 'యుగానికి ఒక్కడు', 'రాజా రాణి', 'అసురన్', 'సూరరై పోట్రు'(ఆకాశమే నీ హద్దు) లాంటి సూపర్ హిట్ సినిమాలకు పాటలు అందించిన జీవీ ప్రకాశ్.. తెలుగులో 'ఉల్లాసంగా.. ఉత్సాహంగా', 'డార్లింగ్', 'ఎందుకంటే ప్రేమంటా', 'లక్కీ భాస్కర్', మట్కా' తదితర చిత్రాలకు సంగీత దర్శకుడిగా పనిచేశారు.




## అలాంటి నేను ఇక్కడి వరకూ వచ్చా

### రీతూ వర్మ

నటనా ప్రాధాన్యమున్న పాత్రలతో అలరిస్తూ.. సినీప్రియులకు దగ్గరైన తెలుగందం రీతూ వర్మ. గతేడాది 'శ్వాగ్'తో ప్రేక్షకుల్ని పలకరించిన ఆమె.. ఇప్పుడు సందీప్ కిషన్‌తో కలిసి 'మజాకా'తో వినోదాలు పంచేందుకు సిద్ధమైంది. వీళ్లిద్దరూ జంటగా నటించిన ఈ చిత్రాన్ని త్రినాథరావు నక్కిన తెరకెక్కించారు. రావు రమేశ్, అన్షు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 26న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకుంది రీతూ. "రచయిత ప్రసన్న కుమార్ ఈ కథ చెప్పినప్పుడు చాలా వినోదాత్మకంగా అనిపించింది. అది విన్నంత సేపూ నేను నవ్వుతూనే ఉన్నా. అలాగే ఇందులో బలమైన భావోద్వేగాలు నిండి ఉన్నాయి. నా పాత్రకీ కథలో ఎంతో ప్రాధాన్యముంది. అందుకే స్క్రిప్ట్ వినగానే దీన్ని చేయాలని నిర్ణయించుకున్నా. ఇది పూర్తిగా త్రినాథరావు శైలి వినోదాత్మక చిత్రం. ప్రేక్షకుల్ని ఆద్యంతం కడుపుబ్బా నవ్విస్తుంది. నేనిందులో కాలేజీ యువతిగా కనిపిస్తా. చిన్నతనంలో ఎదురైన ఓ చేదు అనుభవం ఆమెను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. మరి అదేంటి? దాని వల్ల సందీప్ కిషన్‌తో సాగే ప్రేమలో ఎలాంటి చిక్కులు ఎదురయ్యాయి? అన్నది ఆసక్తికరం. ఇందులో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. నేనిప్పటి వరకు ఈ తరహా పాత్ర చేయలేదు. కచ్చితంగా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది". "ఈ చిత్రంలో నాది.. సందీప్‌ల లవ్‌ట్రాక్‌తో పాటు రావు రమేశ్ – అన్షుల ప్రేమకథకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. అలాగే తండ్రీకొడుకుల అనుబంధం కథకు కీలకంగా నిలుస్తుంది. దీంట్లో ద్వితీయార్ధంలో నాకు.. రావు రమేశ్‌కు మధ్య ఓ సింగిల్ టేక్ సీన్ ఉంది. ఈ మధ్య డబ్బింగ్ పూర్తి చేశాక రమేశ్ నాకు ఫోన్ చేశారు. 'ఆ సీన్ చాలా అద్భుతంగా చేశావమ్మా.. 16ఏళ్ల నా కెరీర్‌లో అలాంటి సీన్ చూడలేద'న్నారు. అది నాకు మర్చిపోలేని జ్ఞాపకం". "నా సినీ ప్రయాణం పట్ల నేను చాలా సంతృప్తిగా ఉన్నా. ఎందుకంటే నేనసలు నటి అవ్వాలనే అనుకోలేదు. అలాంటిది నేనిక్కడికి దాకా వచ్చి.. ఇన్నేళ్లుగా కొనసాగుతున్నా. నటిగా చాలా మంచి సినిమాల్లో భాగమయ్యా. అందులో చిరకాలం గుర్తుంచుకునే పాత్రలు కొన్ని ఉండటం ఆనందాన్నిస్తోంది. నాకు యాక్షన్ ప్రాధాన్యమున్న పాత్రలు చేయాలని ఉంది. కామెడీ చేయడం కూడా నాకు చాలా ఇష్టం. 'మజాకా' ఒప్పుకోవడానికి కారణం ఇదే. అలాగే పూర్తి స్థాయి పీరియాడిక్ సినిమా చేయాలని ఉంది. ప్రస్తుతం నేను తెలుగులో ఓ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పా. అలాగే 'శ్రీకారం' ఫేమ్ కిశోర్ దర్శకత్వంలో ఓ వెబ్‌సిరీస్ చేశా. అది త్వరలో హాట్‌స్టార్‌లో విడుదల కానుంది".

## ఒంటరితనం భయంకరంగా ఉంటుంది

### - సమంత లేటెస్ట్ పోస్ట్ వైరల్



ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సమంత తనకు సంబంధించిన విశేషాలను అభిమానులతో పంచుకుంటుంటారు. విహారయాత్రల గురించి షేర్ చేస్తుంటారు. తాజాగా ఆమె పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. ప్రస్తుతం ఉన్న సోషల్ మీడియా యుగంలో మూడు రోజులు ఫోన్‌కు దూరంగా ఉన్నట్లు తెలిపారు. ఆ అనుభవాన్ని తన ఇన్‌స్టాలో షేర్ చేశారు. "మూడు రోజులు మౌనంగా ఉన్నాను. ఫోన్ లేదు. ఎవరితో కమ్యూనికేషన్ లేదు. నాతో నేను మాత్రమే ఉన్నాను. మనతో మనం ఒంటరిగా ఉండడం కష్టమైన విషయాల్లో ఒకటి. భయంకరమైనది. కానీ, ఇలా మౌనంగా ఉండడాన్ని నేను ఇష్టపడతాను. మిలియన్‌సార్లు ఇలా ఒంటరిగా గడపమని చెప్పినా ఉంటాను. మీరు కూడా ఇలా ఉండటానికి ప్రయత్నించండి" అంటూ అభిమానులకు సూచనలిచ్చారు. తన జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్న సమంత ప్రస్తుతం ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ పెట్టినట్లు తెలుస్తోంది. ఇక సినిమాల విషయానికొస్తే.. తెరపై మహిళా ప్రాధాన్య కథలతో ప్రేక్షకులను మెప్పిస్తున్న సమంత.. మరోవైపు ఓటీటీ వేదికగా భిన్నమైన కథలతో సత్తా చాటుతున్నారు. ఆమె, వరుణ్ ధావన్ కీలకపాత్రల్లో నటించిన 'సిటడెల్ : హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌కు తాజాగా ఐకానిక్ గోల్డ్ అవార్డ్ లభించింది. ఉత్తమ వెబ్‌సిరీస్‌గా అవార్డు గెలుచుకుంది. ప్రస్తుతం 'రక్త్‌బ్రహ్మాండ్'తో బిజీగా ఉన్నారు. ది బ్లడీ కింగ్‌డమ్ అనేది ఉపశీర్షిక. 'తుంబాడ్' ఫేమ్ రాహి అనిల్ బార్వే దర్శకుడు. ఇటీవలే దీని షూటింగ్‌లో జాయిన్ అయినట్లు సమంత తెలిపారు. 'మళ్లీ యాక్షన్ మోడ్‌లోకి వచ్చేశా' అంటూ పోస్ట్ పెట్టారు. ఇప్పటి వరకు తెరపైకి రాని కథతో దీన్ని రూపొందిస్తున్నారు. ఆదిత్యరాయ్ కపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

## దాదాపు పూర్తయిన వార్-2 షూటింగ్

### ఆగస్టు 25న ప్రేక్షకుల ముందుకు..

బాలీవుడ్ కథానాయకుడు హృతిక్ రోషన్ , టాలీవుడ్ స్టార్ హీరో ఎన్టీఆర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రానున్న ఈ స్పై థ్రిల్లర్ ఇది. ఈ చిత్రానికి రైటర్ గా పని చేస్తున్న అబ్బాస్ ఓ అప్‌డేట్ ఇచ్చారు. "'వార్ 2' షూటింగ్ దాదాపు పూర్తయింది. ఆగస్టు 25న విడుదలయ్యే అవకాశం ఉంది. ఆరోజు హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌లను థియేటర్‌లో కలుద్దాం. 'వార్ 2'లో డైలాగులన్నీ నేనే రాశాను. అందరికి నచ్చేలా ఉంటాయి. షారుక్‌ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్‌ల కాంబోలో ఓ సినిమా ప్రారంభం కానుంది. 'పఠాన్ 2' కూడా సిద్ధమవుతోంది. ఈ రెండు సినిమాలకు రచయితగా వర్క్ చేస్తున్నాను." అని తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అబ్బాస్ తెలిపారు. హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ హీరోలుగా తెరకెక్కిన చిత్రం 'వార్'. ఈ స్పై థ్రిల్లర్ సూపర్‌హిట్ కావడంతోపాటు భారీ వసూళ్లు రాబట్టింది. సినిమాపై అంచనాలు ఉండటంతో దీనికి సీక్వెల్‌గా 'వార్2' తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా నటించనున్నట్లు తెలుస్తోంది. గతంలో సల్మాన్ ఖాన్, హృతిక్ రోషన్, షారుక్‌ఖాన్‌లు ఏజెంట్ పాత్రల్లో నటించి మంచి విజయాన్ని అందుకున్నారు. వీటన్నింటికంటే భిన్నంగా ఎన్టీఆర్ పాత్ర ఉంటుందని వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఎన్టీఆర్ ఓ షెడ్యూల్ చేసి వచ్చారు. ఈ సినిమా పూర్తయిన తర్వాత తారక్ ప్రశాంత్ నీల్ చిత్రం షూటింగ్‌లో పాల్గొనున్నారు.




## బన్నీ మరో ఘనత..

### ప్రముఖ హాలీవుడ్ మ్యాగజైన్ కవర్‌పై అల్లు అర్జున్




ప్రముఖ కథానాయకుడు అల్లు అర్జున్ పుష్పతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ సినిమా హాలీవుడ్‌ను సైతం ఆకర్షించారు. ఇప్పుడు ఈ స్టార్ హీరో ఖాతాలో ఇప్పుడు మరో ఘనత చేరింది. ప్రముఖ సినిమా మ్యాగజైన్ 'ది హాలీవుడ్ రిపోర్టర్' ఇప్పుడు 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' పేరుతో భారత్‌లోనూ అడుగుపెట్టేసింది. ఈ మ్యాగజైన్ తొలి సంచిక అల్లు అర్జున్ ఫొటోతో రానుంది. తాజాగా ఈ కవర్ పేజ్ ఫొటో షూట్‌ను నిర్వహించారు. ఆ బీటీఎస్ ప్రోమో వీడియోను తాజాగా షేర్ చేశారు. అందులో అల్లు అర్జున్ పంచుకున్న కొన్ని విషయాలను చూపారు. "ఇండియన్ బాక్సాఫీస్ వద్ద నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నాను. నా జీవితంలో లభించిన అతిపెద్ద అవకాశం ఇదే అని భావిస్తున్నా. బలం, ఆత్మవిశ్వాసం అనేవి మనసులో ఉంటాయి. వాటిని ఎవరూ తీసేయలేరు. కొన్ని లక్షణాలు పుట్టుకతో వస్తాయి. ఇది అలాంటిదే. విజయం తర్వాత కూడా వినయంగా ఉండటం చాలా ముఖ్యం. జీవితంలో సక్సెస్ అయిన తర్వాత కూడా ఎలాంటి గర్వం లేని చాలా మందిని నేను చూశా. అది వారి వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. ఇకపోతే నేను 100 శాతం సామాన్యుడినే. సినిమా చూస్తున్నప్పుడు కూడా ఇదే భావనతో ఉంటాను. అలాగే విరామ సమయంలో కేవలం విశ్రాంతి మాత్రమే తీసుకుంటాను. ఏమీ చేయకుండా ఉండటమే నాకిష్టం. కనీసం పుస్తకం కూడా చదవను" అని ఆ ఇంటర్వ్యూలో అల్లు అర్జున్ వివరించారు. దీనికి సంబంధించిన పూర్తి ఆర్టికల్ కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. 'సినిమాకు హద్దులు లేవని నిరూపించిన స్టార్.. అల్లు అర్జున్: ది రూల్" పేరుతో ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియాలో ఈ ఆర్టికల్ రానుంది. ఈ ఇంటర్వ్యూలో అల్లు అర్జున్ ఇప్పటివరకు సాధించిన విజయాలను వివరించనున్నారు.

## 'దృశ్యం3' రెడీ.. ప్రకటించిన మోహన్‌లాల్..

### గతం ఎప్పటికీ నిశ్శబ్దంగా ఉండదు



అగ్ర కథానాయకుడు మోహన్‌లాల్ సినీ అభిమానులకు శుభవార్త చెప్పారు. 'దృశ్యం3' రాబోతోందని అధికారికంగా ప్రకటించారు. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ థ్రిల్లర్ 'దృశ్యం'. 2013లో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. అంతేకాదు, ఇతర భాషల్లోనూ రీమేక్ అయి, అన్ని చోట్లా అద్భుత స్పందన సొంతం చేసుకుంది. ఆ చిత్రానికి కొనసాగింపుగా 'దృశ్యం2' వచ్చింది. అయితే, కరోనా కారణంగా ఓటీటీలో విడుదలైన ఆ మూవీకి భాషలతో సంబంధం లేకుండా ప్రేక్షకులు ఆదరించారు. మోహన్‌లాల్ నటన, జీతూ జోసెఫ్ టేకింగ్, ట్విస్టింగ్‌కు అందరూ ఫిదా అయ్యారు. ఆ కథను కొనసాగిస్తూ మూడో భాగం ఉంటుందని దర్శకుడు జీతూ జోసెఫ్ అనేక వేదికలపై ప్రకటించారు. సినిమా పట్టాలెక్కడానికి మూడు నాలుగేళ్లు పడుతుందని అన్నారు. అన్నట్లుగానే ఇప్పుడు 'దృశ్యం3' పూర్తి స్క్రిప్ట్ సిద్ధమైందని సమాచారం. దీంతో మోహన్‌లాల్ ఈ విషయాన్ని తెలియజేస్తూ 'గతం ఎప్పటికీ నిశ్శబ్దంగా ఉండదు.. 'దృశ్యం3' రాబోతోంది' అని పేర్కొన్నారు. దర్శకుడు జీతూ జోసెఫ్, నిర్మాత ఆంటోని పెరుంబవూర్‌తో కలిసి దిగిన ఫొటోను పంచుకున్నారు. ఇదీ 'దృశ్యం' సినిమాల కథ..: పోలీస్ ఆఫీసర్ కుమారుడు వరుణ్‌ను జార్జ్‌కుట్టి కుటుంబం హత్య చేయడం, ఆ కేసులో చిక్కుకోకుండా తన కుటుంబాన్ని కాపాడుకునే కథతో 'దృశ్యం' వచ్చింది. అయితే, ఎప్పటికైనా వరుణ్ హత్య కేసు తన కుటుంబాన్ని వెంటాడుతుందన్న భయం మాత్రం జార్జ్‌లో ఉంటుంది. అనుకున్నట్లే కేసు రీఓపెన్ అవుతుంది. అయితే, తన తెలివితేటలతో జార్జ్ మళ్లీ కుటుంబాన్ని కాపాడుకుంటాడు. అదే 'దశ్యం2'. ఈ సినిమా క్లైమాక్స్‌లో వరుణ్ కుటుంబానికి జార్జ్‌కుట్టి ఓ లేఖ పంపుతాడు 'మీరు అడిగినది మీకు ఇస్తున్నా. మళ్లీ మిమ్మల్ని బాధ పెట్టినందుకు క్షమించండి. కనీసం ఇప్పుడైనా మమ్మల్ని ఒంటరిగా వదిలేయండి' అంటాడు. 'ఇది మూసేసిన కేసులాంటిది. కానీ, ఎప్పటికీ ముగియదు. నిజానికి మనం అతనిపై నిఘా పెట్టలేదు. అతనే వెయ్యి కళ్లతో మనల్ని గమనిస్తున్నాడు. నేను కచ్చితంగా చెప్పగలను. ఏ క్షణమైనా మనం తిరిగొస్తే, ఎలా ఎదుర్కోవాలా? అని ఈ క్షణం నుంచే సిద్ధమవుతూ ఉంటాడు. ఒకరకంగా చూస్తే, అతనికి అంతకన్నా పెద్ద శిక్ష ఏముంటుంది' అని ఓ వాయిస్ ఓవర్ వినిపిస్తుంది. వరుణ్ హత్య కేసు నుంచి ఈసారి జార్జ్‌కుట్టి బయటపడిందన్నదే 'దృశ్యం3'. మరి ఇక్కడితో ఈ కేసు ముగిస్తారా? కొనసాగుతుందా? అన్నది ఆసక్తికరం

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463